ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి
"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.
అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక
RNI : TELTEL/2021/80267
సంపుటి: 6 సంచిక: 38, పేజీలు - 08
సోమవారం, ఆగష్టు 3, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# బోనమెత్తిన లష్కర్

- ఉజ్జయిని అమ్మవారి సేవలో సీఎం రేవంత్ రెడ్డి
- ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, బోనం సమర్పణ
- పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క
- అంగరంగ వైభవంగా లష్కర్ బోనాల జాతర







**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్లో లష్కర్ బోనాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. లష్కర్ బోనాల జాతరలో భాగంగా ఆలయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భగుడిలో మహంకాళి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీఆర్ఎస్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా పాల్గొన్నారు. వారు కూడా అమ్మవారికి పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఆలయ పరిసరాల్లో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

2లో..

## వికసిత భారత్ కోసం
# డ్రగ్స్‌కు దూరం
## - యువతకు ప్రధాని మోదీ పిలుపు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశ యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారికి దూరంగా, శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే 'వికసిత భారత్' సంకల్పం నెరవేరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో నేటి తరం యువత చూపిస్తున్న నిబద్ధత, సామాజిక స్పృహ తన నమ్మకాన్ని మరింత బలపరిచాయని ఆయన ప్రశంసించారు. నేడు 'నశా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రధాని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా యువతను ఏకతాటిపైకి తెచ్చి, మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 'మై భారత్' వాలంటీర్ల నేతృత్వంలో ఇది ఒక ప్రజా భాగస్వామ్య (జన్ భాగీదారీ) ఉద్యమంగా రూపుదిద్దుకుంది. "మనం ఒక గొప్ప, ముఖ్యమైన సంకల్పం కోసం ఇక్కడ సమావేశమయ్యాం. ఈ కార్యక్రమం కేవలం ఒక వ్యక్తి, కుటుంబం లేదా సమాజం కోసం కాదు. ఇది దేశం కోసం.

2లో..

## హైడ్రాకు వెల్లువెత్తిన
# ప్రజా మద్దతు
## - కొనసాగించాలంటూ హైదరాబాదులో ర్యాలీలు





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో వరద నివారణ, చెరువుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'హైడ్రా'కు ప్రజా మద్దతు వెల్లువెత్తింది. ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా, హైడ్రా పనితీరును ప్రశంసిస్తూ నగరంలోని పలు కాలనీల సంక్షేమ సంఘాలు

2లో..

# అదనపు పన్నుల వాటా కేటాయింపు
## - కేంద్రానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు

- ఏపీకి కేంద్రం నుంచి రూ.4,597 కోట్ల అదనపు పన్నుల వాటా విడుదల
- నిధులు కేటాయించినందుకు ప్రధానికి, ఆర్థిక మంత్రికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు
- సాధారణ తేదీ కంటే ముందుగానే నిధులు విడుదల చేయడంపై హర్షం
- కేంద్ర సహకారం రాష్ట్ర పురోగతికి ఎంతో దోహదపడుతుందని సీఎం పేర్కొన్నారు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ తెలిపింది. పన్నుల వాటా కింద రాష్ట్రానికి రూ. 4597 కోట్లు విడుదల చేసింది. అన్ని రాష్ట్రాలకు కలిపి సుమారుగా లక్ష కోట్లకు పైగా పన్నులవాటా విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం వాటిలో ఏపీకి రూ. 4597 కోట్లు విడుదల చేసింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. అదనపు పన్నుల వాటా కేటాయింపుపై ప్రధాని నరేంద్రమోడీకి, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు. సకాలంలో పన్నుల వాటా అభివృద్ధికి ఊతం అని సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు.

### సకాలంలో పన్నుల్లో వాటా.. అభివృద్ధికి ఊతం: సీఎం చంద్రబాబు

పన్నుల వాటా కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ. 4,597 కోట్లను కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఇకపోతే తెలంగాణ

2లో..

## బోనాలను రాష్ట్ర పండుగ చేసింది
# మా ప్రభుత్వమే
## - కేసీఆర్ వల్లే బోనాలకు రాష్ట్ర పండుగ హోదా



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని డిమాండ్ చేసినా ఉమ్మడి పాలకులు ఎవరూ పట్టించుకోలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ గారి నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంలో బోనాలను అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఇతర నేతలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు.'యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని రూ. 1,800 కోట్లతో అభివృద్ధి చేసి నిర్మించాం. బోనాల సందర్భంగా ప్రతి ఆలయ కమిటీకి నిధులు కేటాయించాము. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించాము'అని

2లో..

## ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి
# ఏమైనా ఉగ్రవాదా.?




- రాష్ట్రంలో అరాచక పాలన పరాకాష్టకు చేరిందని జగన్ విమర్శ
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారని ఆగ్రహం
- సీదిరి అప్పలరాజు, ముస్తఫాలపై అక్రమ కేసులు బనాయించారని ధ్వజం

**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, 'నారాసుర పాలన'లో అరాచకం పరాకాష్ఠకు చేరిందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దాడి చేసిన అధికార పార్టీ వారికి రక్షణ కల్పిస్తూ, బాధితులైన ప్రతిపక్ష నేతలపైనే హత్యాయత్నం వంటి తీవ్రమైన కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యమా, పోలీస్ రాజ్యమా

2లో..

# దేశంలో రుతుపవనాల వింత పోకడ
## - ఒకచోట కుండపోత, మరోచోట ఉక్కపోత!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలో నైరుతి రుతుపవనాలు విస్తరించినప్పటికీ, వాటి గమనం అసమానంగా, బలహీనంగా కొనసాగుతోంది. ఒకవైపు కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా, మరోవైపు అనేక ప్రాంతాలు వర్షాల కోసం ఎదురుచూస్తున్నాయి. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో వేడిమితో ఉక్కపోత పరిస్థితులు నెలకొన్నాయి. జాతీయ స్థాయిలో ఇప్పటివరకు 11 శాతం వర్షపాత లోటు నమోదైంది. ఈ పరిస్థితిని భారత వాతావరణ శాఖ (ఐఎండీ), ఇస్రో సంయుక్తంగా పంపిన ఇన్శాట్-3డీఎస్ ఉపగ్రహ చిత్రాలు స్పష్టంగా కళ్లకు కడుతున్నాయి. వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, జూన్ 4 నుంచి ఇప్పటివరకు దేశంలో 446.3 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి బదులుగా కేవలం 395.5 మిల్లీమీటర్ల వర్షపాతమే

2లో..

# నల్గొండకు కేంద్రం వరం
## - త్వరలో వెయ్యి కోట్ల నిధులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) త్వరలో కేంద్రం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి ప్రత్యేకనిధులు ఇచ్చే అవకాశం ఉందని, నల్గొండ అభివృద్ధి దీనివల్ల సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం నుంచి సుమారు రూ. 1,000 కోట్ల ప్రత్యేక నిధులు వచ్చే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. ఈ నిధులు అందితే నల్గొండ పట్టణ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధితో పాటు మండలంలోని పలు గ్రామాలలో పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం నల్గొండ తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల కింద 64 మంది లబ్ధిదారులకు మొత్తం 64 లక్షల ఏడు వేల 424 రూపాయల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

2లో..

# బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై బండి ఫైర్
## - నిధుల కేటాయింపుపై తీవ్ర విమర్శలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాల నిర్వహణ మరియు ఏర్పాట్లపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పండుగకు వచ్చే లక్షలాది మంది భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. పవిత్రమైన బోనాల జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో తాగునీరు, క్యూలైన్లు, పరిశుభ్రత వంటి ప్రాథమిక వసతులు

2లో..

# రాజకీయాల్లోకి 'కాక్రోచ్ జనతా పార్టీ'?
## - ఆగస్టు 5న కీలక నిర్ణయం - భవిష్యత్ కార్యాచరణపై చర్చ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆన్‌లైన్ వేదికగా యువతను సమీకరించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఇప్పుడు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రాజకీయాల్లోకి ప్రవేశించాలా, లేక ఉద్యమ సంస్థగానే కొనసాగాలా అనే అంశంపై ఆగస్టు 5న తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపకుడు, జెన్-జీ ఐకాన్‌గా గుర్తింపు పొందిన అభిజీత్ దీప్కే తన నివాసంలో కోర్ కమిటీ సభ్యులతో సమావేశం కానున్నారని విశ్వసనీయ వర్గాలు ఆదివారం తెలిపాయి. వివిధ రాష్ట్రాల్లోని మద్దతుదారుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయనున్నారు.

2లో..

# బోనమెత్తిన లష్కర్

### అమ్మవారికి బంగారు బోనం సమర్పించిన పొన్నం

అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని, ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, బంగారు బోనం సమర్పించారు. అమ్మవారి కరుణా కటాక్షాలు ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. సమృద్ధిగా వర్షాలు పడాలని వేడుకున్నట్లు వివరించారు. భక్తులకు మహంకాళి అమ్మవారు దేదీప్యమానంగా దర్శనం ఇస్తున్నారు.

### భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు

తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించేందుకు ఉజ్జయిని మహంకాళి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆరు క్యూలైన్లను ఏర్పాటు చేసి అమ్మవారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నారు. బోనంతో వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో 2,500 మంది పోలీసులతో భద్రతను ఏర్పాటు చేశారు. 500 మంది ప్రత్యేక వాలంటీర్లు సేవలందిస్తున్నారు. బోనాల సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు.

# వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం

వికసిత భారత్ దిశగా దేశం అడుగులు వేస్తున్నప్పుడు, యువత డ్రగ్స్ సమస్యకు దూరంగా ఉండటం అత్యవసరం" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కాశీతో ఈ కార్యక్రమానికి ఉన్న అనుబంధాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు. "కాశీ ఎంపీగా, ఈ కార్యక్రమం గతేడాది పవిత్ర కాశీ క్షేత్రంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కావడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. దీనివల్ల ఈ కార్యక్రమానికి శాస్త్రీయ దృక్పథంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, సాధువుల ఆశీస్సులు, సాంస్కృతిక వారసత్వం కూడా తోడయ్యాయి" అని ఆయన అన్నారు. 2025 జులైలో వారణాసిలో జరిగిన యూత్ స్పిరిచ్యువల్ సమ్మిట్‌లో దేశంలోని 125 ఆధ్యాత్మిక సంస్థలు ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌తో 'కాశీ డిక్లరేషన్'ను ఆమోదించాయని, వారంతా లక్షలాది పౌరులకు సేవ చేస్తున్నారని మోదీ వివరించారు. యువతను దేశానికి 'అమృత తరం' (అమృత్ పీఢి)గా అభివర్ణించిన ప్రధాని "రాబోయే 20-25 ఏళ్లలో మీ జీవితాలకు మీరే దిశానిర్దేశం చేసుకుంటారు. 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాకారం చేసేది మీరే. ఆ విజయాన్ని సంపూర్ణంగా ఆస్వాదించేది కూడా మీరే. దేశానికి మీ శక్తి, సృజనాత్మకత, ప్రతిభ ఎంతో అవసరం. కాబట్టి దేశం కోసం, మీ సొంత జీవితాల కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండండి" అని పిలుపునిచ్చారు.

ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా క్రీడా కార్యక్రమాలు, వాకథాన్‌లు, ధ్యాన శిబిరాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 'మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే యువతే వికసిత భారత్‌కు అసలైన బలం' అనే సందేశాన్ని దేశంలోని ప్రతి యువకుడికి చేర్చడమే ఈ ఉద్యమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# బోనాలను రాష్ట్ర పండుగ చేసింది మా ప్రభుత్వమే

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.

### - మహంకాళి అమ్మవారి ఆశీస్సులతోనే తెలంగాణ సాధించాం

సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కేటీఆర్‌కు తలసాని శ్రీనివాస్ యాదవ్ శాలువా కప్పి సత్కరించారు. కేటీఆర్‌కు జ్ఞాపికను బహూకరించారు.కులాలకు అతీతంగా జరిపే అద్భుతమైన పండుగ బోనాలు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అమ్మకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటామని తెలిపారు. కానీ సమైక్య రాష్ట్రంలో బోనాలను పట్టించుకోలేదని రాష్ట్ర పండుగ్గా గుర్తించలేదని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ బోనాలకు రాష్ట్ర పండుగ హోదా కల్పించారని అన్నారు. తెలంగాణ సాధించిందే ఆ తల్లి ఆశీస్సులతోనని కేసీఆర్ చెప్పారని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి గుడికి రూ.25 కోట్ల నిధులు విడుదల చేశామని తెలిపారు. ఆలయ కమిటీలకు డబ్బులిచ్చి పండుగలను ఘనంగా నిర్వహించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు.

# అదనపు పన్నుల వాటా కేటాయింపు

విషయానికి వస్తే రూ.2,370 కోట్లు విడుదల చేసింది ప్రభుత్వం.రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలను అంతరాయం లేకుండా అమలు చేసేందుకు, మూలధన వ్యయం పెంచేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.ఈ నిధుల విడుదల పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయ్నుడు స్పందించారు. అదనపు పన్నుల వాటా కేటాయింపుపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. సాధారణంగా ప్రతి నెలా 10వ తేదీన విడుదలయ్యే పన్నుల వాటాతో పాటు అదనంగా రూ.4,597 కోట్ల పన్నుల వాటాను కేటాయించినందుకు ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ఎక్స్ వేదికగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం చేసిన పన్నుల వాటా కేటాయింపుతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత బలం చేకూరుస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల తరఫున ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. అదనపు పన్నుల వాటా విడుదలతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత వేగవంతం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి నిరంతరం అందిస్తున్న సహకారం రాష్ట్ర పురోగతికి ఎంతో దోహదపడుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

### కేంద్రానికి దన్యవాదాలు తెలిపిన పవన్ కల్యాణ్

ప్రతి నెలా 10వ తేదీన విడుదలయ్యే పన్నుల వాటాతో పాటు అదనంగా రూ.4,597 కోట్ల పన్నుల వాటాను కేటాయించినందుకు ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి, పీఎం నరేంద్రమోడీకి ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. 'రాష్ట్రాలకు సకాలంలో వనరులను అందించడమే బలమైన, వేగవంతమైన, సుసంపన్నమైన భారత్‌కు పునాది. సాధారణ షెడ్యూల్ కంటే చాలా ముందే, రాష్ట్రాలకు పన్నుల వాటా కింద రూ.1,09,019 కోట్లను ముందస్తు విడతగా విడుదల చేయాలన్న కేంద్రం నిర్ణయం దూరదృష్టితో తీసుకున్న చర్య. ఇది మూలధన వ్యయాన్ని పెంచుతుంది, మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేస్తుంది. సంక్షేమ పథకాల పంపిణీని బలోపేతం చేస్తుంది. ఉపాధిని సృష్టిస్తుంది, పెట్టుబడులను ఆకర్షిస్తుంది, దేశవ్యాప్తంగా ఆర్థిక వృద్ధిని నిలబెడుతుంది." అంటూ పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలియజేశారు.

### తెలంగాణకు రూ.2370 కోట్లు నిధులు విడుదల

ఇకపోతే పన్నుల వాటా కింద రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం రూ.1,09,019 కోట్లు విడుదల చేసింది. సాధారణంగా ప్రతీ నెలా పదో తేదీలోపు ఈ నిధులను విడుదల చేస్తారు. అయితే గడువు కంటే ముందే కేంద్ర ప్రభుత్వం ఈ అదనపు వాటాను విడుదల చేసింది. దీనివల్ల రాష్ట్రాల వద్ద నిధుల లభ్యత పెరుగుతుందని అభివృద్ధి, సంక్షేమ పథకాలు సజావుగా ముందుకు సాగే అవకాశం కలుగుతుంది అని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇకపోతే తెలంగాణకు రూ.2370 కోట్లు విడుదల చేసింది.

# రాజకీయాల్లోకి 'కాక్రోచ్ జనతా పార్టీ'?

సమావేశం ముగిసిన తర్వాత అభిజీత్ దీప్కే మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తారని పార్టీకి చెందిన ఒక ప్రతినిధి తెలిపారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిర్వహించిన నిరసన విజయవంతం కావడం, దాని ఫలితంగా అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఈ ఉద్యమ సంస్థపై అంచనాలు భారీగా పెరిగాయి. అయితే, విద్యార్థులు, యువత సమస్యలపై స్పందించే 'రెస్పాన్స్ గ్రూప్'గానే సీజేపీని కొనసాగిస్తామని అభిజీత్ గతంలోనే స్పష్టం చేశారు. శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతులకే కట్టుబడి ఉంటామని, ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా మారబోమని, ఏ పార్టీలోనూ విలీనం కాబోమని ఆయన పునరుద్ఘాటించారు.

ఈ నేపథ్యంలో ఆగస్టు 5న జరిగే సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలను నిలబెట్టుకోవడం, విద్యా రంగంలో మార్పులకు చోదకశక్తిగా కొనసాగడం సీజేపీ ముందున్న అసలైన సవాలు అని విశ్లేషకులు భావిస్తున్నారు. సీజేపీ ఉద్యమం వెనుక బాహ్య శక్తుల పాత్ర ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అసంతృప్తి లేనిచోట ఇలాంటి ఉద్యమాలు పుట్టవని, కేవలం ఉన్న సమస్యలను విస్తృతం చేయగలవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సీజేపీ వేగంగా విస్తరించిన తీరు, సోషల్ మీడియాలో వారి ప్రచారం, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం వంటివి గత రెండు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న నిరసన ఉద్యమాల నమూనాను ప్రతిబింబిస్తున్నాయని పరిశీలకులు పేర్కొంటున్నారు.

# హైడ్రాకు వెల్లువెత్తిన ప్రజా మద్దతు

ఆదివారం భారీ ర్యాలీలు నిర్వహించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేస్తూ, హైడ్రా కమిషనర్‌కు సంఘీభావం ప్రకటించాయి. అమీర్‌పేట, మధురానగర్, శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాల్లో శ్రీనివాస నగర్ వెస్ట్, వెంగల్ రావు నగర్, మధుర నగర్ సహా పదుల సంఖ్యలో కాలనీ సంక్షేమ సంఘాలు ఈ ర్యాలీలలో పాల్గొన్నాయి. హైడ్రాపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ, ప్రభుత్వానికి తమ మద్దతును వీడియోల రూపంలో పంపించాయి.గత రెండేళ్లలో హైడ్రా సాధించిన విజయాలే ఈ మద్దతుకు కారణమని సంఘాల ప్రతినిధులు తెలిపారు. సుమారు 3325 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడటంతో పాటు, రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ఆస్తులను పరిరక్షించిందని వారు ప్రశంసించారు. రెండు విడతల్లో 20 చెరువులను పునరుద్ధరించి ఆయా ప్రాంతాల్లో వరద ముప్పును శాశ్వతంగా తొలగించడాన్ని నగర ప్రజలు కళ్లారా చూస్తున్నారని పేర్కొన్నారు. ఒకప్పుడు 5 సెంటీమీటర్ల వర్షానికే అమీర్‌పేట, పరిసర ప్రాంతాలు నీట మునిగేవని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో హైడ్రా రంగంలోకి దిగిందని స్థానికులు గుర్తుచేశారు. జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ వారం రోజుల్లోనే వరద సమస్యను పరిష్కరించిందని కొనియాడారు.

కొంతమంది కబ్జాదారులు, వారికి సహకరించే నాయకులు తమ ఆటలు సాగకపోవడంతోనే సోషల్ మీడియాలో హైడ్రాపై బురద చల్లుతున్నారని వారు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ హైడ్రాను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలోనే ఈ కార్యక్రమాలు కొనసాగాలని నినాదాలు చేశారు. ఇటీవల, హైడ్రా కమిషనర్ గా ఏవీ రంగనాథ్ ను తొలగించాలంటూ తెలంగాణ హైకోర్టు సంచలన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో, నేటి ప్రజా ర్యాలీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా.?

లేక జంగిల్ రాజ్యమా అని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. ఆలూరు బీసీ ఎమ్మెల్యే విరూపాక్షిని అర్ధరాత్రి అరెస్ట్ చేసిన తీరుపై జగన్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. "ప్రజలెన్నుకున్న ఎమ్మెల్యే విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా? అర్ధరాత్రి 2:45 గంటలకు వందలాది పోలీసులతో ఇంటిపై దాడి చేసి, తలుపులు బద్దలుకొట్టి అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది?" అని జగన్ నిలదీశారు.

చిప్పగిరి మండలం నేమకల్లులో టీడీపీ శ్రేణులు తమ పార్టీ నాయకుడి ఇంటిపై దాడి చేయగా, ప్రాణభయంతో ఆ కార్యకర్త ఎమ్మెల్యేకు ఫోన్ చేశాడని జగన్ వివరించారు. బాధితుడికి అండగా నిలబడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపైనే టీడీపీ వారు రాళ్లతో దాడి చేశారని, ఈ ఘటనలో ఆయన సోదరుడు గాయపడ్డాడని తెలిపారు. వాస్తవానికి దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాల్సింది పోయి, బాధితుడైన ఎమ్మెల్యేపైనే హత్యాయత్నం కేసు నమోదు చేయడం దారుణమని అన్నారు. అర్ధరాత్రి పోలీసులు జరిపిన దౌర్జన్యం బయటకు రాకూడదనే భయంతోనే ఎమ్మెల్యే ఇంట్లోని సీసీటీవీ హార్డ్‌డిస్క్‌లను తీసుకెళ్లారని, సాక్ష్యాలను కాపాడాల్సిన పోలీసులతోనే సాక్ష్యాలను మాయం చేయిస్తున్నారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు.ఇదే తరహా రాజకీయ కక్ష సాధింపు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోందని జగన్ విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని హత్య కేసుగా మార్చి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే షేక్ మహ్మద్ ముస్తఫా, ఆయన కుమారుడిపై కూడా వ్యాపార వివాదాన్ని అడ్డుపెట్టుకుని కిడ్నాప్ కేసు బనాయించారని, పోలీసులకు అప్పగించిన వ్యక్తిని కిడ్నాప్ చేశారని కేసు పెట్టడం ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు.ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ అక్రమ అరెస్టులు, దాడులకు పాల్పడుతున్నారని జగన్ అన్నారు. డీఎస్సీ-2025 అక్రమాలపై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఎందుకు రాజీనామా చేయడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.9,500 కోట్ల విద్యా, వసతి దీవెన బకాయిలు, నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.3 వేల భృతి హామీ ఏమైందని నిలదీశారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోందన్నారు. "అధికారం, పోలీసు బలం శాశ్వతం కాదు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అర్ధరాత్రి అరెస్టులు చేసినా వైసీపీ వెనక్కి తగ్గదు. బాధితులకు అండగా నిలుస్తూ అరాచక పాలనపై పోరాటం కొనసాగిస్తాం" అని జగన్ స్పష్టం చేశారు.

# దేశంలో రుతుపవనాల వింత పోకడ

నమోదైంది. ఉపగ్రహ చిత్రాల్లో పశ్చిమ, మధ్య భారతదేశంపై దట్టమైన మేఘాలు ఆవరించి ఉండగా, గంగా-సింధు మైదాన ప్రాంతాలైన ఢిల్లీ, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లోని చాలా ప్రాంతాల్లో ఆకాశం నిర్మలంగా కనిపిస్తోంది.ప్రస్తుతం గుజరాత్, దాని పరిసర ప్రాంతాల్లో క్రియాశీలంగా ఉన్న వాతావరణ వ్యవస్థ కారణంగా అక్కడ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీనికి విరుద్ధంగా, వాయువ్య భారతదేశంలో రుతుపవనాల కదలికలు బలహీనంగా ఉన్నాయి. అయితే, రుతుపవన ద్రోణి ఉత్తరం వైపు కదిలే అవకాశం ఉండటంతో రాబోయే రోజుల్లో ఉత్తరాది రాష్ట్రాల్లో పరిస్థితి మెరుగుపడొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఆదివారం నుంచి ఢిల్లీ, హర్యానా, పంజాబ్, యూపీల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది. ఆగస్టు 3 నుంచి 5 మధ్య వర్షాలు పుంజుకుని, 40 నుంచి 70 శాతం ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు (40-100 మి.మీ.) కురవొచ్చని తెలిపింది. మరోవైపు, దక్షిణ, మధ్య రాజస్థాన్‌లో ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. మొత్తం మీద, కొన్ని పశ్చిమ ప్రాంతాలు వరదలతో సతమతమవుతుండగా, ఉత్తరాది ప్రాంతాలు విస్తారమైన వర్షాల కోసం ఇంకా ఎదురుచూస్తున్నాయి.

# బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై బండి ఫైర్

సరిగ్గా లేకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దుయ్యబట్టారు.ఉత్సవాల బడ్జెట్ కేటాయింపులపై బండి సంజయ్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీశారు. "రంజాన్ పండుగకు రూ. 33 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, రాష్ట్రంలో 80 శాతానికి పైగా ఉన్న హిందువుల అత్యంత ప్రాధాన్యమైన బోనాల ఉత్సవాలకు కేవలం రూ. 20 కోట్లు మాత్రమే ఇవ్వడం ఎంతవరకు న్యాయం?" అని ప్రశ్నించారు. సొంత పండుగలు, సంస్కృతి సంప్రదాయాల నిర్వహణ కోసం హిందువులు ప్రభుత్వం వద్ద బిచ్చమెత్తుకోవాలా అని మండిపడ్డారు. పండుగల నిర్వహణకు నిధుల కేటాయింపు రాజకీయ కోణంలో కాకుండా, జనాభా ప్రాతిపదికన సమానంగా జరగాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

# నల్గొండకు కేంద్రం వరం

### సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు

ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామని, అర్హులందరికీ లబ్ధి చేకూర్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. నల్గొండను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడానికి ఇటీవల 83 కోట్ల రూపాయలతో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు.

### పట్టణ ప్రజల తాగునీటికి అదనంగా మరో 300 కోట్ల రూపాయలు

పట్టణ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడానికి ప్రభుత్వం అదనంగా మరో 300 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు నగర మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రహదారులు, డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థ, పారిశుద్ధ్యం వంటి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నామని పేర్కొన్నారు.

### పట్టణ ప్రాంతాలలోనూ ఇల్లు లేని నిరుపేదలకు 700 ఇళ్ళు

కేంద్ర నిధులు మంజూరైతే నల్గొండ నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి రూపొందించిన ప్రణాళికను అమలు చేస్తామని, అత్యాధునిక నగరంగా నల్గొండ ని తీర్చిదిద్దుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

ప్రభుత్వం పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత నిస్తుందని, ఈ క్రమంలోనే పట్టణ ప్రాంతాలలోనూ ఇల్లు లేని నిరుపేదలకు 700 ఇళ్లను మంజూరు చేసినట్టు వెల్లడించారు.

### అభివృద్ధి, సంక్షేమం రెండూ సమానంగా ముందుకు తీసుకెళతాం

సొంత స్థలం ఉన్న పేద కుటుంబాలు ఇల్లు నిర్మించుకునేందుకు అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధి సంక్షేమం రెండింటిని రెండు కళ్ళుగా చూస్తామని, వాటిని సమానంగా ముందుకు తీసుకువెళ్లడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.

# బ్రహ్మపుత్ర నదిలో మునిగి.. ఐఐటి గౌహతి విద్యార్థిని మృతి



గౌహతి: ఐఐటి గౌహతికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రమాదవశాత్తు జారి బ్రహ్మపుత్ర నదిలో పడ్డారు. ఒక విద్యార్థిని నదిలో మునిగి మరణించగా, మరో విద్యార్థినిని రెస్క్యూ సిబ్బంది రక్షించారు. అస్సాం రాజధానిలోని ఐఐటీ గౌహతిలో చదువుతూ క్యాంపస్ హాస్టల్‌లో ఉంటున్న ఇద్దరు అమ్మాయిలు శనివారం కొంత సమయం బయట గడిపేందుకు లతియా బగీచా ఘాట్ వద్దకు వెళ్లారు.కాగా, ప్రమాదవశాత్తు కాలు జారడంతో ఆ ఇద్దరు విద్యార్థినులు బ్రహ్మపుత్ర నదిలో పడ్డారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే జాతీయ విపత్తు ప్రతిస్పందన దళానికి (ఎన్‌డిఆర్ఎఫ్) చెందిన సిబ్బంది అక్కడకు చేరుకున్నారు.

ఒక అమ్మాయిని పది నిమిషాల్లో రక్షించారు. మునిగిపోయిన మరో విద్యార్థిని కోసం గజ ఈతగాళ్ల సహాయంతో నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. మూడు గంటల తర్వాత ఆమె మృతదేహాన్ని వెలికితీశారు. మరోవైపు మరణించిన యువతి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగానికి చెందిన బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అని ఐఐటి గౌహతి యాజమాన్యం తెలిపింది. ఆమె అకాల మరణం పట్ల సంతాపం వ్యక్తం చేసింది. తమ విద్యా సంస్థతో పాటు విద్యార్థిని కుటుంబానికి పూడ్చలేని నష్టమని పేర్కొంది. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించింది.

# హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు..

## కొండచరియలు విరిగిపడి 102 రోడ్లు మూసివేత



హిమాచల్ ప్రదేశ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. కొద్ది రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల వల్ల అనేక ప్రాంతాల్లో వరద సంభవించింది. కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీంతో జనజీవనం స్తంభించింది. ఆగష్టు 7 వరకు కూడా భారీ వర్షాలు పడే ఛాన్స్ ఉందని ఐఎండీ హెచ్చరించింది. అలాగే, హిమాచల్ ప్రదేశ్‌లోని అనేక ప్రాంతాలకు యెల్లో అలర్ట్ జారీ చేసింది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడటం, మరికొన్ని ప్రాంతాల్లో కూడా దీనికి అవకాశం ఉండటంతో రోడ్డు రవాణాపై తీవ్ర ప్రభావం పడుతోంది.ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 102 రోడ్లను అధికారులు మూసివేశారు. మండి ప్రాంతంలో 43 రోడ్లు, కుల్లు ప్రాంతంలో 33 రోడ్లు, షిమ్లా ప్రాంతంలో 11 రోడ్లు, చంబా, కంగ్రా, సిర్మౌర్, ఉనా ప్రాంతాల్లోనూ పలు రోడ్లు దెబ్బతిన్నాయి.

అనేక జిల్లాల్లో తాగునీటి సరఫరాకు, విద్యుత్ సరఫరాకు కూడా తీవ్ర ఆటంకం కలుగుతోంది. విద్యుత్ సరఫరాకు సంబంధించిన సామగ్రి దెబ్బతినడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. ప్రభుత్వ నీటి సరఫరాకు సంబంధించిన 28 వ్యవస్థలు దెబ్బతిన్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లో గత నెలలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. జూలై 1 నుంచి 31 వరకు సగటు వర్షపాతం 255.9కాగా, ఈ నెలలో 275.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ నెలలోనూ భారీ వర్షాలకు ఛాన్స్ ఉంది. ఇప్పటికే ఐఎండీ అధికారులు యెల్లో అలర్ట్ జారీ చేశారు. దీంతో హిమాచల్ ప్రదేశ్ అధికారులు అప్రమత్తమయ్యారు. పరిస్థితిని సమీక్షిస్తూ సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. రోడ్ల మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. సాధారణ ప్రజలు, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# విరిగిపడ్డ కొండచరియలు..

## ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం



భారీ వర్షాలకు కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ జిల్లా ఇందిరానగర్‌లో ఘోర విషాద ఘటన చోటుచేసుకుంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు (ఇవాళ) ఓ కుటుంబం బలైంది. ఈ రోజు తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడటంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. బాధితుల్లో మూడేళ్ల చిన్నారి ఉండటం స్థానికులను తీవ్రంగా కలచివేస్తోంది.కొప్పల్ జిల్లా గంగావతి తాలుకా కొక్కరెగర గ్రామానికి చెందిన మల్లికార్జున్ (35) తన భార్య నాగవేణి (28), కుమారుడు సంతోశ్ (3) తో కలిసి ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్నాడు. అయితే వారంతా నిద్రిస్తుండగా భారీ వర్షాలకు ఈరోజు తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడ్డాయి. సరిగ్గా వారు నివాసం ఉంటున్న రేకుల షెడ్డుపై పడటంతో నిద్రలోనే వారంతా కన్నుమూశారు. మరోవైపు పక్కనున్న షెడ్డుపైనా మట్టి రాళ్లు వచ్చి పడటంతో అందులో ఉన్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.సమాచారం అందుకున్న పోలీసులు, అత్యవసర సేవల విభాగం, అగ్నిమాపక బృంద సభ్యులు రంగంలోకి దిగారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన బాధితుడిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం శిథిలాల కింద చిక్కుకున్న మృతదేహాలను వెలికి తీసేందుకు సహాయక చర్యలు చేపట్టారు. కాగా మల్నాడు ప్రాంతంలో కురుస్తున్న ఎడతెరిపిలేని భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించినట్లు పోలీసులు ధ్రువీకరించారు.

# బీపీ టెస్ట్ కోసం

## పది నిమిషాలు వేచి ఉండమన్న డాక్టర్..



న్యూఢిల్లీ: బీపీ టెస్ట్ కోసం పది నిమిషాలు వేచి ఉండమని డాక్టర్ అన్నారు. అయితే ఆ వ్యక్తి సహనం కోల్పోయాడు. ఒక స్టూల్‌తో డాక్టర్‌పై దాడి చేశాడు. (ద్రీ జూఫ్‌అవత్ ౼ఖుఎం ఙశీష్‌శీతీ) ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో బీపీ టెస్ట్ చేయకుండానే అతడి బీపీ బయటపడిందంటూ కామెంట్లు వెల్లువెత్తాయి. ఒక రోగి వైద్య పరీక్షల కోసం డాక్టర్ వద్దకు వెళ్లాడు. అయితే అతడి బీపీ చెక్ చేయడానికి పది నిమిషాలు వేచి ఉండమని ఆ డాక్టర్ చెప్పారు.కాగా, ఆ వ్యక్తి ఒక్కసారిగా ఆగ్రహానికి గురయ్యాడు. కుర్చీ నుంచి లేచి నిలబడి పక్కనే ఉన్న బరువైన చెక్క స్టూల్ తీసుకుని వైద్యుడి తలపై బలంగా కొట్టాడు. దెబ్బ తగలడంతో ఆ డాక్టర్ బాధతో అల్లాడిపోయారు. ఆ రోగి దాడి నుంచి తప్పించుకునేందుకు స్టూల్‌ను గట్టిగా పట్టుకున్నారు. అయితే ఈ సంఘటన ఎప్పుడు, ఎక్కడ జరిగిందో అన్నది తెలియలేదు.మరోవైపు డాక్టర్ రూమ్‌లోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో దీనిపై మిశ్రమ స్పందన వ్యక్తమైంది. ఆ రోగి తీరుపై నెటిజన్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైద్యులపై పెరుగుతున్న అసహనం, హింసకు ఇది ఒక నిదర్శనమని ఆరోపించారు. డాక్టర్‌పై రోగి దాడిని చాలా మంది ఖండించారు. అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మరి కొందరు నెటిజన్లు మాత్రం హాస్యంగా స్పందించారు. ఆ రోగి కోపమే అతడి బీపీ ఎక్కువగా ఉందని నిరూపించిందని చాలా మంది కామెంట్లు చేశారు. 'బీపీ ఎక్కువగా ఉందో లేదో తెలుసుకోవడానికి ఇది ఒక మార్గం' అని ఒకరు చమత్కరించారు. 'ఇకపై అతడి బీపీ చెక్ చేయాల్సిన అవసరం లేదు. అది ఎంత ఎక్కువగా ఉందో అతనే నిరూపించాడు' అని మరొకరు కామెంట్ చేశారు. 'డాక్టర్ బీపీని అతడు పెంచాడు, కానీ అతడి బీపీ మాత్రం సాధారణ స్థితికి వచ్చి ఉంటుంది' అని మరొకరు సరదాగా వ్యాఖ్యానించారు

## బీఆర్ఎస్ కార్యకర్తకు అండగా

## మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



చండూరు: ఇటీవల అనారోగ్యంతో రెండు కిడ్నీలు ఇన్ఫెక్షన్ వచ్చి, లంగ్స్ (ఊపిరితిత్తులు) ఇన్ఫెక్షన్ తో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం చండూరు మండల పరిధిలోని బోడంగిపర్తి గ్రామం బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు, 7వ వార్డు మెంబర్ రేవల్లి నరేష్‌ను మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆదివారం నిమ్స్ ఆస్పత్రిలో పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన నిమ్స్ ఆస్పత్రి డాక్టర్లతో మాట్లాడి నరేష్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని, అతనికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా భయపడవద్దని మీకు అండగా నేనున్నా అని నరేశ్‌కు, వారి కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా కూసుకుంట్ల ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చుల నిమిత్తం తక్షణమే తన వంతుగా 20 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి పెద్ద మనసు చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బోడంగిపర్తి బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కట్కూరి సత్తయ్య, 2 వార్డ్ మెంబర్ వట్టికోటి శ్రీనివాస్, వర్కాల శ్రవణ్, ఎండి సత్తార్, రేవెల్లి శ్రీను,రేవెల్లి మహేష్, వర్కాల అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ నిట్‌లో 'ఇండస్ట్రీ కాన్‌క్లేవ్

## - కెరీర్ లాంచ్ సమ్మిట్'..!




హనుమకొండ చౌరస్తా: ఎన్ఐటీలోని 'ఇండస్ట్రీ కాన్ క్లేవ్: కెరీర్ లాంచ్ సమ్మిట్-2026' నిర్వహించారు. సెంటర్ ఫర్ కెరీర్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. నిట్‌లో ఈ తరహాలో నిర్వహించిన మొట్టమొదటి ఇండస్ట్రీ కాన్‌క్లేవ్‌గా నిలిచిన కార్యక్రమం ఇదే. త్వరలో నిట్ క్యాంపస్‌లో జరుగబోయే ప్లేస్‌మెంట్ సీజన్‌కు ముందు విద్యార్థులకు పరిశ్రమల అంచనాలు, అవసరమైన నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు 'ఇండస్ట్రీ కాన్ క్లేవ్: కెరీర్ లాంచ్ సమ్మిట్-2026'ను రూపొందించారు. ఆన్‌లైన్‌లో ఈ కార్యక్రమంలో పాల్గొన్న నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి..

ఈ వినూత్న కార్యక్రమాన్ని అభినందించారు. సీసీపీడీ బృందం రూపొందించిన సదస్సు ద్వారా విద్యార్థులు చురుకుగా పాల్గొని పరిశ్రమ అవసరాలను అర్థం చేసుకుని ప్రయోజనం పొందాలని ఆయన ఆకాంక్షించారు. సీసీపీడీ హెడ్ ప్రొఫెసర్ పి.వి.సురేష్ ఈ కాన్‌క్లేవ్ నిర్వహణ లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్లేస్‌మెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రెండురోజుల పాటు నిర్వహించిన ఈ సమ్మిట్‌లో హెచ్‌పీసీఎల్, ఎక్సాన్ మొబిల్, మైక్రోన్, ట్రూవెటా వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొని లీడర్ షిప్ టాక్స్, ప్యానెల్ చర్చలు, అలుమ్‌ని ఇంటరాక్షన్ కార్యక్రమాలు నిర్వహించారు. కోర్ ఇంజినీరింగ్, కన్సల్టింగ్, సెమీకండక్టర్, ఎనర్జీ, కృత్రిమ మేధస్సు ఆధారిత పరిశ్రమల్లో అవసరమైన నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలపై వారు విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు.

# కార్యకర్తకు అండగా మాజీ ఎమ్మెల్యే..

# వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందజేత.. !

చండూరు, ఆగస్టు 02: అనారోగ్యానికి గురైన బీఆర్ఎస్ కార్యకర్తకు మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అండగా నిలిచారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బోడంగిపర్తి గ్రామం బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు రేవల్లి నరేష్‌కు ప్రభాకర్ రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం నిమ్స్‌కు వెళ్లిన ఆయన అక్కడ.. నరేష్‌ను పరామర్శించి వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.

చండూరు మండల పరిధిలోని బోడంగిపర్తి గ్రామం బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు, 7వ వార్డు మెంబర్ రేవల్లి నరేష్ ఇటీవల తీవ్ర ఆనారోగ్యంతో ఆస్పత్రి పాలయ్యాడు. రెండు మూత్రపిండాలకు ఇన్ఫెక్షన్, ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్ కారణంగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరాడు నరేష్. కొన్ని రోజులుగా నిమ్స్‌లోనే చికిత్స పొందుతున్న నరేష్‌ను మునుగోడు మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పరామర్శించారు. ఆదివారం నిమ్స్ ఆస్పత్రికి వెళ్లిన ప్రభాకర్ రెడ్డి .. డాక్టర్లతో మాట్లాడి నరేష్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. అతడికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ప్రభాకర్ రెడ్డి కోరారు. 'ఎన్ని ఇబ్బందులు వచ్చినా భయపడవద్దని, మీకు అండగా నేనున్నా' అని నరేష్‌కు, అతడి కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చుల నిమిత్తం తక్షణమే తన వంతు సాయంగా రూ. 20 వేలు అందజేసి పెద్ద మనసు చాటుకున్నారు. ప్రభాకర్ రెడ్డితో పాటు నరేష్‌ను పరామర్శించిన వారిలో బోడంగిపర్తి బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కట్కూరి సత్తయ్య, 2 వార్డ్ మెంబర్ వట్టికోటి శ్రీనివాస్, వర్కాల శ్రవణ్, ఎండి సత్తార్, రేవెల్లి శ్రీను, రేవెల్లి మహేష్, వర్కాల అంబేద్కర్ ఉన్నారు.



# మాజీ ఎంపీ అశోక్ సిద్ధార్థ్‌ను పార్టీ నుంచి

# బహిష్కరించిన బీఎస్పీ చీఫ్ మాయవతి

బీఎస్పీ అధినేత్రి మాయవతి .. రాజ్యసభ మాజీ ఎంపీ అశోక్ సిద్ధార్థ్ ను పార్టీ నుంచి బహిష్కరించారు. అదేవిధంగా పార్టీ కోఆర్డినేటర్ రణధీర్ సింగ్ బేనీవాల్ పై కూడా బహిష్కరణ వేటు వేశారు. పార్టీ మార్గదర్శకాలను పలుమార్లు ఉల్లంఘించడం, క్రమశిక్షణారాహిత్యం కారణాలతో వారిని తొలగించారు. ఎక్స్ వేదికగా బీఎస్పీ అధినేత్రి ఈ విషయాలను వెల్లడించారు. సిద్ధార్థ్‌ను గతంలో ఒకసారి బహిష్కరించిన విషయాన్ని బీఎస్పీ చీఫ్ మాయావతి ఎక్స్ వేదికగా వెల్లడించారు.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా టికెట్ల పంపిణీ విషయంలో రాష్ట్ర పార్టీ ప్రెసిడెంట్‌తో సమన్వయం చేసుకోనందుకు నాడు ఆయనను బహిష్కరించామని మాయ తెలిపారు. మరోసారి ఇలాంటివి జరగవని సిద్ధార్థ్ హామీ ఇవ్వడంతో పార్టీలోకి మళ్లీ అనుమతించామని అన్నారు. ఆ తర్వాత పార్టీకి సంబంధించి పలు బాధ్యతలను అప్పగించామని చెప్పారు. కానీ కర్ణాటక, ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో బీఎస్పీ మార్గదర్శకాలను సిద్ధార్థ్ మళ్లీ ఉల్లంఘిచారని మాయావతి చెప్పారు. దాంతో ఇప్పుడు ఆయనను పార్టీకి చెందిన అన్ని బాధ్యతల నుంచి తప్పించామని తెలిపారు.అయితే సిద్ధార్థ్ మళ్లీ యూపీకి తిరిగొస్తున్నారన్న వార్తలు వ్యాపించాయని, పార్టీలో కార్యకలాపాలకు అడ్డంకులు సృష్టించేందుకు కుట్ర జరిగిందని మాయావతి ఆరోపించారు.

కాబట్టి పార్టీ ప్రయోజనాల దృష్ట్యా తక్షణం ఆయనను పార్టీ నుంచి బహిష్కరించామని చెప్పారు. మాయవతి మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌కు సిద్ధార్థ్ మామ అవుతాడు. కాగా, పార్టీ కోఆర్డినేటర్ బేనీవాల్‌కు కూడా క్రమశిక్షణ లేని కారణంగా పార్టీ నుంచి బహిష్కరించామని బీఎస్పీ చీఫ్ మాయావతి చెప్పారు. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్ బాధ్యతలను గతంలో ఆయనకు అప్పగించామని అన్నారు. కానీ ఆయన పార్టీ మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ క్రమశిక్షణారాహిత్యం ప్రదర్శిస్తున్నట్టు తరచూ ఆరోపణలు




వస్తున్నాయని తెలిపారు. కాబట్టి పార్టీ ప్రయోజనాలను కాపాడుకునేందుకు బేనీవాల్‌ను కూడా బహిష్కరించామని చెప్పారు.

## ఇండోనేసియా మదురా ఐలాండ్‌లో

# ఫెర్రీకి అగ్నిప్రమాదం..


## ఐదుగురు మృతి.. 41 మంది గల్లంతు



ఇండోనేసియాలోని మదురా ద్వీపంలో ఒక ఫెర్రీ అగి?్నప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఐదుగురు మరణించగా, మరో 41 మంది గల్లంతయ్యారు. ఘటన జరిగిన సమయంలో ఫెర్రీలో 271 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటన ఆదివారం, ఇండోనేసియా తీరంలో జరిగింది. ఈస్ట్ జావా ప్రావిన్స్ నుంచి ఒక ఫెర్రీ దక్షిణ సులావేసిలోని మకస్సార్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న సమయంలో ఫెర్రీలో, కొన్ని గంటల తర్వాత ఉన్నట్లుండి మంటలు చెలరేగాయి.దీంతో ఫెర్రీ సిబ్బంది ఇండోనేసియా ఎమర్జెన్సీ సర్వీసెస్‌కు సమాచారం అందించారు. దీంతో సహాయక బృందాలు ఫెర్రీ వద్దకు చేరుకుని, ప్రయాణికుల్ని రక్షించేందుకు ప్రయత్నించాయి. మొత్తం 225 మందిని రెస్క్యూ టీంలు కాపాడాయి. ఐదుగురు మరణించగా, 41 మంది గల్లంతయ్యారు. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఇండోనేసియా అధికారులు వెల్లడించారు. అయితే, ఫెర్రీలో అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని అధికారులు అన్నారు. అగ్నిప్రమాదం జరిగిన తర్వాత అందులోని ప్రయాణికులు ఫెర్రీ ముందు భాగానికి వచ్చి సహాయం కోసం అర్థించారు.అక్కడే ఉన్న నౌకల వారిని సహాయం అడిగారు. గత ఏడాది కూడా ఇండోనేసియాలో ఒక ఫెర్రీ అగ్నిప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా, 150 మందిని సహాయక బృందాలు రక్షించాయి. ఇటీవలి కాలంలో ఇండోనేసియాలో ఫెర్రీలు అనేకసార్లు అగ్నిప్రమాదాలకు గురవుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

## కుర్కురే ప్యాకెట్‌లో టాయ్ బాల్..

## గొంతులో ఇరుక్కుని బాలుడు మృతి



బెంగళూరు: కుర్కురే ప్యాకెట్‌లో వచ్చిన చిన్న టాయ్ బాల్‌తో బాలుడు ఆడుకున్నాడు. అయితే పొరపాటున అది గొంతులో ఇరుక్కోవడంతో ఊపిరాడక ఆ చిన్నారి మరణించాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొన్నది. కర్ణాటకలోని మైసూరు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గౌరీపుర గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు కుర్కురే ప్యాకెట్ తిన్నాడు. అందులో ఉచితంగా అందించిన చిన్న బాల్‌తో ఆడుకున్నాడు. కాగా, ఆ బాలుడు ఆడుకుంటూ పొరపాటున ఆ చిన్న బాల్‌ను మింగాడు. అది గొంతులో ఇరుక్కుపోవడంతో ఊపిరి అందక ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. ఫలితం లేకపోవడంతో ఆ బాలుడు మరణించాడు. మరోవైపు ఆ గ్రామంలోని ప్రముఖ కుటుంబానికి చెందిన ఏకైక సంతానం కావడంతో ఆ బాలుడి కుటుంబంతో పాటు గ్రామస్తులలోనూ తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ సమాచారం తమకు తెసిందని పోలుసులు తెలిపారు. అయితే ఆ కుటుంబం నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేని చెప్పారు.

## అప్పాయిపల్లిలో పొట్టేళ్ల బండి ఊరేగింపు..

## అమ్మవారి మొక్కులు తీర్చుకున్న చిన్నారులు..!



దౌల్తాబాద్: బేగంపేట గ్రామదేవత శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవాల్లో చేపట్టిన పొట్టేళ్ల బండి ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామ సంప్రదాయాలను, సంస్కృతిని చిన్న వయసులోనే అలవర్చుకుంటూ చిన్నారులు స్వయంగా పొట్టేళ్ల బండిని తయారు చేసి భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లడం వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు "జై మహంకాళి అమ్మవారు" నినాదాలతో గ్రామ వీధుల గుండా పొట్టేళ్ల బండిని లాగుతూ ఆలయానికి చేరుకున్నారు. మహంకాళి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తమ కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కొబ్బరికాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, సమయానికి వర్షాలు కురవాలని, పశుసంపద అభివృద్ధి చెందాలని, గ్రామ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నారు. గ్రామంపై మహంకాళి అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు చిన్నారులు.ప్రతి సంవత్సరం బోనాల పండుగ సందర్భంగా గ్రామదేవతకు బోనాలు సమర్పించడం, మొక్కులు తీర్చుకోవడం తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు. ఈ సంప్రదాయాన్ని భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో చిన్నారులను కూడా ఈ వేడుకల్లో భాగస్వాములను చేస్తున్నామని పేర్కొన్నారు. పొట్టేళ్ల బండి ఊరేగింపును తిలకించేందుకు బేగంపేట, అప్పాయిపల్లి గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు బోనాలు సమర్పించగా.. యువకులు, చిన్నారులు భక్తి గీతాలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపులో పాల్గొన్నారు. చిన్నారుల భక్తి, ఉత్సాహం, సంప్రదాయాల పట్ల వారికున్న గౌరవం, ఆసక్తిని గ్రామస్థులు అభినందించారు.

## 'రుద్రగణపతి'గా రుద్రేశ్వరస్వామి..

## ఘనంగా అన్నపూజ, పుష్పార్చన..!



హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 2: చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో సంకటహర చతుర్థి పురస్కరించుకొని ఉత్తిష్ఠ గణపతికి నవరసాభిషేకం పంచామృత అభిషేకం, హరిద్రా కుంకుమ విలీపన అభిషేకం నిర్వర్తించారు. రుద్రేశ్వరుడికి రుద్రాభిషేకం అనంతరం 51 కిలోల పెరుగన్నం, మిర్యాలపొడితో స్వామివారిని రుద్రగణపతిగా అలంకరించారు. రుద్రగణపతిగా స్వామివారిని అలంకరించిన తర్వాత అన్నపూజ, పుష్పార్చన జరిపారు. హైదరాబాద్‌కు చెందిన పరమశివ భక్తులు శ్రీ వెంకటసాయి ఆనంద విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఈ అన్నపూజా కార్యక్రమం నిర్వహించారు. తెలుగు అకాడమీ ఛైర్మన్ కూరపాటి వెంకటనారాయణ బంధువులతో కలిసి దేవాలయానికి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, వేదపండితులు, మణికంఠశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.అనిల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# రాజధాని నిర్మాణమా.. ప్రజల ప్రాణాలతో చెలగాటమా.?

## లైసెన్స్ లేని డ్రైవర్లు.. మద్యం మత్తులో టిప్పర్లు.. తాడికొండలో మృత్యు ఘంటికలు
## పగిలిపోయిన రోడ్లు.. దుమ్ముతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు..
## బైపాస్ లేక నరకయాతన





అమరావతి(ప్రశ్న న్యూస్) రాజధాని నిర్మాణ పనులు రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కీలకమైనవే. రాజధాని నిర్మాణం వేగంగా సాగాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. అయితే అభివృద్ధి పేరుతో ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడటం మాత్రం ఏ మాత్రం సమర్థనీయం కాదు. ప్రస్తుతం గుంటూరు, తాడికొండ, తుళ్లూరు పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇదే. రాజధాని నిర్మాణానికి అవసరమైన ఇసుక, కంకర, మట్టి, సిమెంట్, ఇతర నిర్మాణ సామగ్రిని తరలిస్తున్న వందలాది టిప్పర్ లారీలు ప్రతిరోజూ తాడికొండ గ్రామం మీదుగా భారీ సంఖ్యలో ప్రయాణిస్తున్నాయి. ఈ రవాణా వ్యవస్థ ప్రజలకు తీవ్ర ఇబ్బందులను, ప్రాణాంతక ప్రమాదాలను తీసుకొస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల ఆరోపణల ప్రకారం, అనేక టిప్పర్ లారీలను నడుపుతున్న డ్రైవర్లకు హెవీ మోటార్ వెహికిల్, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా సాధారణ లైసెన్సులతోనే భారీ వాహనాలను నడిపిస్తున్నారని చెబుతున్నారు. ఇది మోటారు వాహన చట్టాలకు పూర్తిగా విరుద్ధమని పేర్కొంటున్నారు. లారీ యజమానులు అనుభవం లేని డ్రైవర్లను తక్కువ జీతాలతో నియమించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, కొంతమంది డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యం మత్తులో నడిచే వందల టన్నుల బరువున్న టిప్పర్ లారీలు గ్రామాల గుండా దూసుకెళ్తుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. రోడ్డు దాటాలన్నా, పిల్లలను పాఠశాలకు పంపాలన్నా, ద్విచక్ర వాహనంపై ప్రయాణించాలన్నా గుండెల్లో గుబులు తప్పడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు.గత జూలై నెలలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడం ప్రజలను మరింత కలవరపెట్టింది. అయినప్పటికీ సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఒకవైపు ప్రమాదాలు జరుగుతున్నా, మరోవైపు తనిఖీలు కనిపించకపోవడంతో డ్రైవర్లు తమ ఇష్టానుసారంగా వేగంగా వాహనాలు నడుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.రవాణా శాఖ (ఆర్టీఓ), పోలీసులు, సీఆర్డీఏ అధికారులు, జిల్లా యంత్రాంగం ఈ వ్యవహారాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదనే ప్రశ్న ప్రజల నుంచి వినిపిస్తోంది. ప్రతిరోజూ వందలాది టిప్పర్ లారీలు గ్రామాల గుండా ప్రయాణిస్తున్నప్పటికీ, డ్రైవర్ల లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, మద్యం పరీక్షలు, వాహనాల ఓవర్‌లోడింగ్ వంటి అంశాలపై సమగ్ర తనిఖీలు జరగడం లేదని ఆరోపణలు ఉన్నాయి.స్థానికుల మాటల్లో మరో ముఖ్యమైన అంశం కూడా ఉంది. అనేక మంది డ్రైవర్లు ఇతర రాష్ట్రాలకు చెందిన వారేనని, స్థానిక భాష తెలియకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నారని చెబుతున్నారు. భాష తెలియకపోవడం ఒక్కటే తప్పు కాకపోయినా, సరైన శిక్షణ లేకుండా, స్థానిక రహదారుల పరిస్థితులు తెలియకుండా భారీ వాహనాలు నడపడం ప్రమాదకరమని ప్రజలు అంటున్నారు. కొందరు డ్రైవర్లు మద్యం లేదా ఇతర మత్తు పదార్థాల ప్రభావంలో వాహనాలు నడుపుతున్నారనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ ఆరోపణలు నిజమా కాదా అన్నది సంబంధిత అధికారులు సమగ్ర విచారణ ద్వారా నిర్ధారించాల్సిన అవసరం ఉంది.టిప్పర్ లారీల నిరంతర రాకపోకల వల్ల తాడికొండ ప్రాంతంలోని రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని స్థానికులు చెబుతున్నారు. రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో సాధారణ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై పేరుకుపోయే దుమ్ము, కంకర కారణంగా ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదాలు పెరుగుతున్నాయి. అంతేకాకుండా, లారీలు వేగంగా వెళ్లిన ప్రతిసారి ఎగిసే దుమ్ము గ్రామమంతా వ్యాపించి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తమవుతోంది.ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రతి రోజు స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు దుమ్ములోనే ప్రయాణించాల్సి వస్తోంది. ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, మహిళలు ఇలా ప్రతి ఒక్కరూ ఈ సమస్యతో సతమతమవుతున్నారు. దుమ్ము కారణంగా దగ్గు, అలర్జీ, శ్వాస సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజల అభిప్రాయం ప్రకారం రాజధాని నిర్మాణాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదు. కానీ నిర్మాణ సామగ్రి రవాణా కోసం గ్రామాల మధ్య రహదారులను ఉపయోగించడం వల్ల వేలాది మంది ప్రజల జీవనం అస్తవ్యస్తమవుతోందని అంటున్నారు. అందుకే టిప్పర్ లారీల కోసం ప్రత్యేక బైపాస్ రహదారిని నిర్మించాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు.తాడికొండ గ్రామంలో ప్రధాన రహదారిపై టిప్పర్ లారీల రద్దీ కారణంగా వాహనాలకు గ్యాప్ లేకుండా పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. ఒకవైపు స్కూల్ బస్సులు, మరోవైపు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, నడిచే ప్రజలు, వీటి మధ్య భారీ టిప్పర్లు వేగంగా దూసుకెళ్లడం ప్రమాదాలకు దారితీస్తోందని ఆవేదన వ్యక్తమవుతోంది.ప్రజలు కోరుతున్న ప్రధాన డిమాండ్లు ఇవే,టిప్పర్ లారీ డ్రైవర్ల లైసెన్సులను ప్రత్యేకంగా తనిఖీ చేయాలి.హెవీ వెహికల్ లైసెన్స్ లేని వారిని వెంటనే విధుల నుంచి తొలగించాలి.మద్యం సేవించి వాహనాలు నడిపే డ్రైవర్లపై ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలి.టిప్పర్ లారీల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ మానిటరింగ్ ఏర్పాటు చేయాలి.ఓవర్‌లోడింగ్ చేసే వాహనాలపై భారీ జరిమానాలు విధించాలి.రోడ్లపై నీరు చల్లి దుమ్ము తగ్గించే చర్యలు చేపట్టాలి.దెబ్బతిన్న రహదారులను అత్యవసరంగా మరమ్మతు చేయాలి.గ్రామాల గుండా కాకుండా టిప్పర్ లారీల కోసం ప్రత్యేక బైపాస్ రహదారిని ఏర్పాటు చేయాలి.స్కూల్ సమయాల్లో భారీ వాహనాల రాకపోకలను పరిమితం చేయాలి. పోలీసులు, ఆర్టీఓ, సీఆర్డీఏ అధికారులు సంయుక్తంగా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి.రాజధాని నిర్మాణం రాష్ట్ర భవిష్యత్తుకు అవసరమే. కానీ అదే సమయంలో ప్రజల భద్రత కూడా ప్రభుత్వానికి అంతే ముఖ్యమైన బాధ్యత. అభివృద్ధి పేరిట గ్రామాల ప్రజలు నిత్యం భయంతో బతికే పరిస్థితి రావడం సరైన పద్ధతి కాదు. ఒక ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందస్తు చర్యలు తీసుకోవడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత.జిల్లా కలెక్టర్, పోలీసు శాఖ, రవాణా శాఖ, సీఆర్డీఏ అధికారులు సంయుక్తంగా తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# గజ్వేల్‌లో హోరాహోరీ పోరు

- స్థానిక సంస్థల ఎన్నికలను తలపించిన తంజీముల్ మజీద్ కమిటీ ఎన్నికలు
- 286 ఓట్ల భారీ మెజార్టీతో వరుసగా రెండోసారి అధ్యక్షుడిగా సయ్యద్ మతీన్ ఘన విజయం
- మైనార్టీల సమస్యల పరిష్కారమే లక్ష్యం
- సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తాం: సయ్యద్ మతీన్



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** గజ్వేల్ పట్టణంలోని తంజీముల్ మజీద్ కమిటీ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలను తలపించేలా అత్యంత ఉత్కంఠభరితంగా జరిగాయి. స్థానిక రాజకీయ నాయకుల పరోక్ష మద్దతు, తీవ్ర ప్రచారం, పరస్పర విమర్శలు--ప్రతివిమర్శల నడుమ జరిగిన ఈ ఎన్నికల్లో సయ్యద్ మతీన్ మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుతూ 286 ఓట్ల భారీ మెజార్టీతో అధ్యక్ష పదవిని కైవసం చేసుకున్నారు.మొత్తం 1,784 మంది ఓటర్లలో 1,092 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా, ప్రత్యర్థి షేర్ అలీకి 552 ఓట్లు, సయ్యద్ మతీన్కు 838 ఓట్లు లభించాయి. దీంతో 286 ఓట్ల స్పష్టమైన ఆధిక్యంతో సయ్యద్ మతీన్ విజేతగా ఎన్నికల అధికారులు ప్రకటించారు.ఫలితాలు వెలువడగానే మద్దతుదారులు భారీ ఎత్తున సంబరాలు నిర్వహించి, నినాదాలతో గజ్వేల్ పట్టణాన్ని హోరెత్తించారు.విజయం అనంతరం మాట్లాడిన నూతన అధ్యక్షుడు సయ్యద్ మతీన్, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా అమలు చేస్తానని స్పష్టం చేశారు. మహిళల సాధికారత, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పన, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.అలాగే మాజీ ఎమ్మెల్యే టి. నర్సారెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి గజ్వేల్ మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, ముస్లింల స్మశానవాటిక ఏర్పాటు సహా పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తన విజయానికి సహకరించిన ప్రతి ఓటరికి, ముస్లిం సోదరులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన సయ్యద్ మతీన్, "ఎన్నికలతో విభేదాలకు ముగింపు పలికి... ఇకపై అందరం ఒక్కటిగా కలిసి తంజీముల్ మజీద్ కమిటీ అభివృద్ధి, గజ్వేల్ మైనార్టీల సంక్షేమం కోసం పని చేద్దాం" అని పిలుపునిచ్చారు.


# ఆగష్టు 4 నుంచి నీట్ యూజీ కౌన్సెలింగ్.. తరగతులు ప్రారంభమయ్యేది ఎప్పటినుంచంటే




నీట్ యూజీ ఫలితాలు గత నెలలో విడుదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ర్యాంకులు కూడా వెల్లడయ్యాయి. దీంతో నీట్ యూజీ కౌన్సెలింగ్‌కు ఎన్‌టీయే సిద్ధమైంది. ఆగష్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. అన్ని కోటాలకు సంబంధించిన కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. డీమ్డ్ కాలేజీలు, సెంట్రల్ యూనివర్సిటీలు సహా అన్ని కాలేజీలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈ విషయాన్ని మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ తెలిపింది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్ సహా వివిధ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ కౌన్సెలింగ్ జరుగుతుంది.ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు సెప్టెంబర్ 8 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. మొదటి దశ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 4 నుంచి 17 వరకు జరుగుతుంది. ఆ వెంటనే సీట్ల కేటాయింపు జరుగుతుంది. సీట్లు లభించిన విద్యార్థులు ఈ నెల 22లోపు జాయిన్ అవ్వాల్సి ఉంటుంది. రెండో దశ కౌన్సెలింగ్ ఆగష్టు 24 నుంచి సెప్టెంబర్ 2 వరకు జరుగుతుంది. మూడో దశ కౌన్సెలింగ్ సెప్టెంబర్ 10 నుంచి సెప్టెంబర్ 18 వరకు జరుగుతుంది. మిగిలిపోయిన సీట్లకు సంబంధించిన తుది దశ కౌన్సెలింగ్ సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 3 వరకు జరుగుతుంది. ఇలా సీట్లు దక్కిన విద్యార్థులు అక్టోబర్ 10 లోపు కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. రాష్ట్ర కోటాకు సంబంధించి తొలి దశ కౌన్సెలింగ్ ప్రక్రియ ఆగష్టు 13 నుంచి 22 వరకు జరుగుతుంది. రాష్ట్ర స్థాయి కాలేజీలకు ఎంపికైన విద్యార్థులు ఆగష్టు 28 లోపు చేరాల్సి ఉంటుంది. రెండో దశ కౌన్సెలింగ్ ప్రక్రియ ఆగష్టు 31 నుంచి సెప్టెంబర్ 8 వరకు, మూడో దశ కౌన్సెలింగ్ సెప్టెంబర్ 16 నుంచి 26 వరకు జరుగుతుంది. మిగిలిపోయిన సీట్లకు సంబంధించి తుది దశ కౌన్సెలింగ్ అక్టోబర్ 3 నుంచి 5 వరకు జరుగుతుంది. నిబంధనలకు అనుగుణంగా కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

# కుల్గాం దాడి తీవ్రవాదుల వివరాలు వెల్లడించండి.. కేంద్రానికి ఫరూక్ అబ్దుల్లా డిమాండ్

తాజాగా జమ్మూ కాశ్మీర్‌లోని కుల్గాంతోపాటు అనంత్‌నాగ్‌లో ఉగ్రవాదులు దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దాడికి పాల్పడిన తీవ్రవాదుల వివరాల్ని వెల్లడించాలని, వారి గుర్తింపును బహిరంగపరచాలని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా డిమాండ్ చేశారు. ఇన్ని భద్రతా చర్యలు తీసుకుంటున్నా అసలు తీవ్రవాదులు ఎక్కడినుంచి వస్తున్నారు అంటూ ఫరూక్ ప్రశ్నించారు. తాజా ఘటనల నేపథ్యంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రెండు రోజుల క్రితం కుల్గాంలో ఉగ్రవాదులు దాడి చేసి, ఇద్దరు వలస కార్మికుల్ని కాల్చి చంపారు.అలాగే, అనంత్‌నాగ్‌లో కూడా ఒక పోలీసు అధికారికి కాల్చివేశారు. ఈ నేపథ్యంలో మరోసారి జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడి జరగడంతో ఆందోళన నెలకొంది. దీనిపై ఫరూక్ మాట్లాడారు. "ఈ హత్యలు ఎవరు చేస్తున్నారో ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలి. వాళ్లను ఉగ్రవాదులు చంపారని మాత్రమే చెప్పారు. సరిహద్దులు మూసి ఉన్నా సరే అసలు తీవ్రవాదులు దేశంలోకి ఎలా ప్రవేశిస్తున్నారు అనేదే అసలైన ప్రశ్న. కాశ్మీర్ లోయలో ఉగ్రవాదం అంతమైందని చెప్పిన లెఫ్టినెంట్ గవర్నర్ వ్యాఖ్యలు తప్పని చూపించడానికి హంతకుల నిజస్వరూపాల్ని బయటపెట్టడం అవసరం. మనమే కాదు.. ప్రపంచం అంతా ఉగ్రవాదుల్ని చూడాలి. తీవ్రవాదం అంతమైందా..? పరిస్థితులు ఎలా మారాయో చూడండి" అంటూ ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. మరోవైపు 2019లో కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్మూకాశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక హోదాను తొలగించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర హోదాను తొలగించి, కేంద్ర పాలిత ప్రాంతంగా విభజించింది. జమ్మూ-కాశ్మీర్‌తోపాటు, లదాక్ అనే రెండు కేంద్ర పాలిత ప్రాంతాలను ఏర్పాటు చేసింది. దీనిపై కూడా ఫరూక్ అబ్దుల్లా అభ్యంతరం వ్యక్తం చేశారు. జమ్మూ కాశ్మీర్‌కు కేంద్రం రాష్ట్ర హోదాను తిరిగి పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే, పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్ (పీవోజేకే)లో జరుగుతున్న మారణహోమాన్ని కూడా ఫరూక్ వ్యతిరేకించారు. పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అక్కడ ఆందోళన చేపట్టిన వారిపై పాక్ ప్రభుత్వం కాల్పులు జరపడంతో గత వారం 50 మందికిపైగా మరణించారు. దీనిపై ఫరూక్ మాట్లాడుతూ.. "పీవోజేకేలో ఉన్నది మన సోదరులే. వాళ్లు ఎదుర్కొంటున్న పరిస్థితుల్ని చూస్తే బాధ కలుగుతుంది. ఐక్యరాజ్యసమితికి మానవ హక్కుల సంఘం ఉంది. వారు ఒక బృందాన్ని పంపి అక్కడ ఏం జరుగుతుందో చూడాలి. ఈ విషయంలో ప్రపంచం అంతా మౌనంగా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. మన దేశం కూడా దీని గురించి ఏమీ



చెప్పడం లేదు" అంటూ ఫరూక్ వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరం
## - మాజీ మంత్రి పువ్వాడ



కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రంలోని ఆటో డ్రైవర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామంలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్-బీఆర్టీయూ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చినా, అధికారంలోకి వచ్చి 30 నెలలు గడిచినా ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆరోపించారు.ఆటో డ్రైవర్లు నిత్యం పెరుగుతున్న డీజిల్, పెట్రోల్, సీఎన్‌జీ ధరలు, విడిభాగాల ధరలు, వాహన నిర్వహణ ఖర్చులు, ఫైనాన్స్ ఈఎంఐలు, కుటుంబ పోషణ భారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వారికి భరోసా కల్పించాల్సిన సమయంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో అనేక మందికి ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని, ఆటో డ్రైవర్ల కుటుంబాలకు తక్షణ సహాయం అందించడంతో పాటు శాశ్వత సంక్షేమ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ నాయకత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేసిందని గుర్తు చేశారు. ప్రమాద బీమా పథకం ద్వారా ప్రమాదవశాత్తు మరణించిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా అందించి ఆర్థిక భరోసా కల్పించిందని తెలిపారు. కార్మిక వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పనిచేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆటో డ్రైవర్లు కీలక పాత్ర పోషించారని, ఉద్యమంలో ముందుండి పోరాడిన వారిని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. అధికారంలోకి రావడానికి ఆటో డ్రైవర్లను ఓట్ల కోసం ఉపయోగించుకుని ఇప్పుడు వారి సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.

# 'ఉన్న రోగం పోతదని వస్తే.. కొత్త రోగాలు వచ్చేలా పెద్దాసుపత్రి'



జయశంకర్ భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రధాన ఆస్పత్రిని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, సిబ్బంది పనితీరు, డాక్టర్ల సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రోగులకు శాపంగా పెద్దాసుపత్రి మారిందన్నారు. ఉన్న రోగం పోతదని వస్తే.. కొత్త రోగాలు వచ్చేలా ఆసుపత్రి తీరున్నదని ఫైర్ అయ్యారు. ఇటీవలే ప్రారంభించిన ఎమ్మారై స్కాన్ నిత్యం మూతబడి ఉండటమేంటి.. అని అధికారులను ప్రశ్నించారు. ఎమ్మారై స్కాన్ పరిస్థితి చూసి పేదల గుండెలు బరువెక్కి పోతున్నాయి. అధ్వానంగా మరుగుదొడ్ల పరిశుభ్రత ఆక్సిజన్ ప్లాంట్ సమస్య వెంటనే పరిష్కరించాలి. త్రాగునీరు లేక రోగులు అల్లాడిపోతున్నారన్నారు. జిల్లా ప్రధాన ఆస్పత్రిలో కండోమ్స్ దర్శనమివ్వడంపై మాజీ ఎమ్మెల్యే గండ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఫ్రెండ్‌షిప్ డే అని బీచ్‌కు వెళ్తే.. మింగేసిన రాకాసి అలలు..



ఫ్రెండ్‌షిప్ డేను ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉండేలా ప్లాన్ చేసుకున్నారు ఇద్దరు స్నేహితులు. అయితే అనుకోని ఘటన ఆ ఇద్దరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. నీతు తన స్నేహితుడు రాముతో కలిసి సముద్రతీర అందాలను ఆస్వాదించేందుకు సరదాగా వైజాగ్ బీచ్‌కు వెళ్లింది. ఫ్రెండ్‌షిప్ డే వేడుకల్లో భాగంగా బీచ్‌కు వెళ్లి ఫొటోలు దిగుతుండగా.. అలలు ఒక్కసారిగా తీరంవైపు దూసుకొచ్చాయి. అలల ఉధృతికి నీతు సముద్రంలోకి కొట్టుకుపోయింది. తన స్నేహితురాలు నీతును కాపాడబోయి రాము కూడా సముద్రంలో గల్లంతయ్యాడు. గల్లంతైన వారి కోసం కోస్ట్ గార్డ్ టీం, పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. సంతోషంగా జరుపుకోవాల్సిన ఫ్రెండ్‌షిప్ డేన ఇలా ఇద్దరు స్నేహితులు బీచ్‌లో గల్లంతవడం అందరినీ కలిచివేస్తుంది. నీతును పెదజాలరిపేటకు చెందిన యువతిగా గుర్తించారు. నీతు, రాము మృతితో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి.

# ఉండవల్లి రోడ్డంటేనే భయం

## - కుంగిన రహదారి.. ఒరిగిన ట్రాక్టర్ గంటపాటు ట్రాఫిక్ స్తంభనం
## - నల్లమట్టి అక్రమ రవాణాతో బురదమయం.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం



**ఉండవల్లి(ప్రశ్న న్యూస్)** ఒకప్పుడు ప్రధాన రాకపోకలకు కీలకంగా ఉన్న ఉండవల్లి గ్రామంలోని కోస్టల్ బ్యాంక్ నుంచి శ్మశానం వరకు వెళ్లే రహదారి ప్రస్తుతం ప్రజలకు నరకయాతనగా మారింది. అడుగు అడుగునా గుంతలు, రోడ్డు కుంగిపోవడం, వర్షం పడితే బురదమయం కావడం, నల్లమట్టి అక్రమ రవాణాతో రహదారి పూర్తిగా దెబ్బతినడం వంటి సమస్యలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ వందలాది వాహనాలు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, గ్రామస్థులు ఈ రహదారిపైనే ఆధారపడుతున్నప్పటికీ అధికారులు మాత్రం శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులకు నిదర్శనంగా ఆదివారం ఉదయం చోటుచేసుకున్న ఘటన అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. డ్రైనేజ్ శుభ్రపరిచే పనుల కోసం ఉండవల్లి సచివాలయానికి చెందిన ట్రాక్టర్‌ను రహదారిపై నిలిపిన క్షణాల్లోనే, గతంలో కుంగిపోయిన ప్రాంతం మరోసారి కూలిపోయింది. ఒక్కసారిగా రహదారి దిగజారి ట్రాక్టర్ ఒక వైపుకు ఒరిగిపోవడంతో అక్కడి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోయినా, మరికొన్ని క్షణాలు ఆలస్యమైతే భారీ ప్రమాదం జరిగేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ట్రాక్టర్ కూరుకుపోవడంతో ఆ మార్గంలో దాదాపు గంటపాటు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇరువైపులా వాహనాలు బారులు తీరగా, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరకు రెండు జేసీబీలను రంగంలోకి దించి తీవ్రంగా శ్రమించిన తర్వాత ట్రాక్టర్‌ను బయటకు తీశారు. దీంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈ ఘటన రహదారి ఎంత ప్రమాదకరంగా మారిందో మరోసారి స్పష్టంచేసింది. స్థానికుల కథనం ప్రకారం, ఇదే ప్రాంతంలో గతంలో కూడా రోడ్డు కుంగిపోయింది. అప్పుడు శాశ్వత మరమ్మతులు చేపట్టాల్సిన చోట పైపైన మట్టి, కంకర వేసి తాత్కాలికంగా పూడ్చేశారు. సమస్య మూలాన్ని పరిష్కరించకుండా చేసిన ఆ పనులు ఇప్పుడు మళ్లీ బయటపడుతున్నాయి. కొద్దిపాటి ఒత్తిడి వచ్చినా రహదారి కుంగిపోతుండడం ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ రహదారిపై మరో ప్రధాన సమస్య నల్లమట్టి అక్రమ రవాణా. భారీ వాహనాలు నిరంతరం రాకపోకలు సాగించడం వల్ల రహదారి బలహీనపడడమే కాకుండా, వాటి నుంచి జారిపడే నల్లమట్టి మొత్తం రోడ్డును కప్పేస్తోంది. వర్షం కురిస్తే ఆ మట్టి బురదగా మారి ద్విచక్ర వాహనదారులకు మరింత ప్రమాదంగా మారుతోంది. పలువురు జారి పడిన ఘటనలు జరిగినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రతిరోజూ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లే సిబ్బంది, రైతులు, అత్యవసర సేవల వాహనాలు కూడా ఇదే రహదారిని ఉపయోగించాల్సి వస్తోంది. కానీ రోడ్డుపై ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ కుంగిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి గుంతలు నీటితో నిండిపోవడంతో అవి కనిపించక ప్రమాదాలు మరింత పెరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు జారి గాయపడటం, ఆటోలు అదుపు తప్పడం, చిన్నపాటి ప్రమాదాలు జరగడం ఇక్కడ సాధారణ విషయంగా మారిపోయిందని స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ సంబంధిత శాఖలు కేవలం తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామస్థులు చెబుతున్న మరో అంశం ఏమిటంటే, ఈ రహదారిపై శాశ్వత పరిష్కారం కోసం ఎన్నిసార్లు అధికారులకు వినతులు ఇచ్చినా స్పందన కనిపించడం లేదని. ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లినా హామీలకే పరిమితమైందని అంటున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత మాత్రమే అధికారులు వచ్చి పరిశీలించడం, ఆ తర్వాత మళ్లీ మరిచిపోవడం పరిపాటిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక గ్రామానికి ప్రధాన రహదారి ఇంత దయనీయంగా మారడం అభివృద్ధిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. కోట్ల రూపాయలతో రహదారుల అభివృద్ధి జరుగుతోందని ప్రభుత్వాలు ప్రకటిస్తున్న వేళ, ప్రజలు ప్రతిరోజూ ఉపయోగించే ఈ మార్గం మాత్రం గుంతలతో నిండిపోయి ఉండడం బాధాకరమని స్థానికులు అంటున్నారు. ప్రమాదం జరిగే వరకు ఎదురుచూడకుండా, ప్రాణనష్టం సంభవించేలోపే అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కేవలం పైపైన పూడ్చే మరమ్మతులు కాకుండా, రహదారి బేస్‌ను పూర్తిగా పరిశీలించి బలమైన డ్రైనేజీ వ్యవస్థతో పాటు శాశ్వతంగా కొత్త రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే నల్లమట్టి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుని, భారీ వాహనాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈరోజు ట్రాక్టర్ ఒరిగిన ఘటన ఒక హెచ్చరిక మాత్రమే. రేపు ఇదే చోట స్కూల్ బస్సు, అంబులెన్స్ లేదా ప్రయాణికులతో నిండిన వాహనం కుంగిపోతే బాధ్యత ఎవరు తీసుకుంటారు.? ప్రజల ప్రాణాల కంటే పెద్దది ఏదీ కాదు. అందుకే ఉండవల్లి రహదారి సమస్యను అత్యవసరంగా పరిగణించి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు ఏకగ్రీవంగా డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఈ రహదారి మరిన్ని ప్రమాదాలకు వేదిక కావడం ఖాయమనే ఆందోళన వ్యక్తమవుతోంది.

# బోనాల జాతరలో ఎమ్మెల్యే శ్రీ గణేష్



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగ. ఆషాడమాశంలో ప్రారంభమైయ్యే మహిళా మణుల తొలి పండుగ బోనాల ఉత్సవాలు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరలో పాల్గొని అమ్మవారికి భక్తి శ్రద్ధలతో బోనం సమర్పిస్తారు. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు సందర్భంగా తొలి బోనం ప్రభుత్వం తరపు నుంచి హైదరాబాద్ జిల్లా ఇంఛార్జ్,రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమర్పించారు. అలాగే ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు కురిసి అన్నదాతలు,ప్రజలు సుఖసంతోషాలతో పాటు అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే వివిధ శాఖలకు చెందిన మంత్రులు,టిపిసిసి అధ్యక్షుడు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,భారసా మాజీ మంత్రి కేటిఆర్,సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్,భాజపా మల్కాజిగిరి ఎంపీ ఈటల, కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి బండి సంజయ్ తదితరులు అమ్మా వారిని దర్శించుకున్నారు.

### భక్తుల తాకిడితో ఉజ్జయిని మహంకాళి దేవాలయం పరిసరాలు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది..

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని నిన్న ఉద్యమం శాస్త్రోక్తంగా ఉదయం మూడు గంటలకు అభిషేకం చేసి పట్టువస్త్రాలు,రకరకాల పూలతో అలంకరించిన దేవదాయక అధికారులు. తెల్లవారుజాము నుంచి భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి క్యూ లైన్లో క్యూ కట్టారు. పోలీసులు ప్రత్యేకంగా అమ్మా వారికి బోనం సమర్పించే భక్తులకు విడిగా క్యూ లైన్ ఏర్పాటు చేశారు. సాధరణ భక్తుల కోసం క్యూ లైన్లు సైతం ఏర్పాటు చేయడమే కాకుండా దారిలో మంచి నీటి సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశారు. అయితే మధ్యాహ్నం వంటి గంట సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చినప్పుడు భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎందుకంటే సుమారు గంటపాటు క్యూ లైన్లో భక్తులు బోనం తో నిలబడి కొందరికి బిపి డౌ అయ్యి స్పృహ తప్పి లైన్లో పడిపోవడంతో పక్కనే ఉన్న వైద్యులు చేరుకొని ప్రాథమిక చికిత్స అందించారు. మిగితా భక్తులు అయితే నిర్వాహకులను ఏర్పాట్లు సరిగ్గా లేవు, అమ్మా వారి దర్శనార్థం వచ్చిన భక్తులకు ప్రత్యేక చోరవ చూపక వివిఐపీలు లంటూ లగెత్తుతున్నారు. ఇదేమీ పరిస్థితిరా బాబు అంటూ ఆవేదన వ్యక్తంచేశారు.

### సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్..

బోనాల పండుగ సందర్భంగా శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్. తెలంగాణ రాష్ట్ర పండుగ అయిన బోనాల జాతరను పురస్కరించుకుని, సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీగణేష్ చారిత్రాత్మక సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు,దేవాలయా ప్రధాన పూజారి ఎమ్మెల్యే కి స్వాగతం పలికిగా ఆయనఅమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత ఆలయ పూజారులు ఎమ్మెల్యేకు వేదా మంత్రాలతో అశీర్వచనం అందించారు. తెలంగాణ ప్రజలందరికీ, సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే,ఆషాఢ మాస బోనాల జాతర మహోత్సవాలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవడం సంతోషకరంగా ఉందని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దయా కటాక్షాలు రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని,అందరికీ అమ్మావారు ఆరోగ్యం,ఆయుష్షు,ఐశ్వర్యం ప్రసాదించాలని ప్రార్థించినట్టు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ప్రాంగణంలో ప్రభుత్వం,అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్టు, భక్తులు అందరూ అమ్మవారి దర్శనం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణు గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్,సంతోష్ యాదవ్, గణేష్ టెంపుల్ మాజీ ఛైర్మన్ ప్రభాకర్ యాదవ్,మోండా మార్కెట్ డివిజన్ అధ్యక్షుడు నాగేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఐదో వార్డు బోనాల వేడుకలో ఎమ్మెల్యే శ్రీ గణేష్..

బోనాల సందర్భంగా నల్ల పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్. తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగ సందర్భంగా ఈరోజు 5వ వార్డు గాంధీ నగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయాన్ని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీగణేష్ దర్శించుకున్నారు.
ఆయనఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బోనాల పండుగ మన సంస్కృతికి అద్దం పడుతుందని అమ్మవారి దయాకటాక్షాలతో నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని కోరుకున్నట్టు తెలిపారు.

# సుప్రీం కోర్టు తీర్పు మార్గదర్శకాలను అమలు చేయాలి
# రోస్టర్ విధానానికి నిరసనగా మాల సంఘాల జేఏసీ రిలే నిరాహార దీక్ష

**- దీక్షా శిబిరానికి సంఘీభావం తెలిపిన ఉమ్మడి మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి**

**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తుంగలో తొక్కి, ఎస్సీ వర్గీకరణ చట్టం, అశాస్త్రీయ రోస్టర్ విధానం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాల మరియు దాని అనుబంధ కులాలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని నిరసిస్తూ తుమ్మ శ్రీనివాస్ అధ్యక్షతన, తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ (సిద్దిపేట జిల్లా) ఆధ్వర్యంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించి ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి జేఏసీ నాయకులకు తన పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణకు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు లోబడి పాలన సాగాలని, మాల మరియు దాని అనుబంధ కులాల హక్కులకు భంగం వాటిల్లేలా నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదన్నారు. బాధితుల ఆందోళనలను, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిగణనలోకి తీసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా తెచ్చిన ఎస్సీ వర్గీకరణ జీవోలు/చట్టాలను సవరించాలన్నారు. మాల, అనుబంధ కులాల అవకాశాలను దెబ్బతీస్తున్న ప్రస్తుత రోస్టర్ విధానాన్ని పునఃసమీక్షించి న్యాయం చేయాలన్నారు. అన్యాయానికి గురవుతున్న ఉపకులాల ప్రయోజనాలను కాపాడే వరకు ఆందోళనలను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, మాల సామాజిక వర్గ నాయకులు పాల్గొన్నారు.



## దేశానికి వెన్నెముక బావి పౌరులు:భానుక నర్మదా



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న పల్లవి మాడల్ హై స్కూల్ లో "నాష ముక్త్" కార్యక్రమంలో పాల్గొన్న బోర్డు నామినేటెడ్ సభ్యురాలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులందరికీ నా హృదయపూర్వక అభినందనలు. నేను "వికసిత్ భారత్ కోసం నాషా ముక్త్ యువ"(మత్తుపదార్థాల రహిత యువత) అనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశంపై మాట్లాడటానికి ఈరోజు మీ ముందుకు వచ్చాను. భారతదేశం 2047 నాటికి 'వికసిత్ భారత్' లేదా అభివృద్ధి చెందిన దేశంగా మారాలని ఒక గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ కల సాకారం కావాలంటే మన దేశానికి ఉన్న అతిపెద్ద బలం అయిన 'యువశక్తి' ఆరోగ్యంగా,బలంగా ఉండాలి. ఒక దేశ భవిష్యత్తు ఆ దేశ యువత ఆలోచనలపై,వారి నడవడిక పై ఆధారపడి ఉంటుంది. కానీ దురదృష్టవశాత్తు,ఈ రోజు మన యువతలో కొందరు 'నాషా' అంటే మత్తుపదార్థాలు, ధూమపానం,మద్యపానం డ్రగ్స్ వంటి వ్యసనాల బారిన పడుతున్నారు. మత్తు అనేది కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాదు,ఆ కుటుంబాన్ని,అంతిమంగా దేశ ఆర్థిక వ్యవస్థను భవిష్యత్తును నాశనం చేస్తుంది. వ్యసనాలకు బానిసైన యువత ఉన్న దేశం ఎప్పటికీ అభివృద్ధి చెందదు. మనం వికసిత్ భారత్‌ను సాధించాలంటే, ముందుగా మన యువతను'నాషా ముక్త్' (మత్తు రహిత) యువతగా మార్చాలి. యువత తమ శక్తినంతటినీ వ్యసనాలపై కాకుండా చదువు,క్రీడలు, సాంకేతికత,నూతన ఆవిష్కరణలు దేశసేవపై కేంద్రీకరించాలి. ఆరోగ్యకరమైన శరీరంలోనే ఆనందంతో కూడిన ఆలోచనలు పుడతాయి. ఆ ఆలోచనలే దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తాయి. ఈ మార్పు మన నుంచే ప్రారంభం కావాలి. మన స్నేహితులు ఎవరైనా తప్పుదారి పడుతుంటే వారిని వారించాలి. మత్తుపదార్థాలకు "నో" చెప్పే ధైర్యాన్ని అలవర్చుకోవాలి. ప్రభుత్వం చేపట్టిన 'నాషా ముక్త్ భారత్ అభియాన్'లో మనమందరం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చివరగా నేను కోరేది ఒక్కటే అంటూ మత్తును వీడుదాం,ప్రగతిని నాటుదాం. యువత సృజనాత్మకతతో, సన్మార్గంలో పయనించి వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాజపా సీనియర్ నాయకులు భానుక మల్లికార్జున్, బి.ఎన్.శ్రీనివాస్, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రవేట్ స్కూల్ బస్ డ్రైవర్స్ యూనియన్ ఏర్పాటు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ మండలం ప్రైవేట్ స్కూల్స్ బస్ డ్రైవర్స్ సీఐటీయూ యూనియన్ కమిటీ వేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ మేడ్చల్ మండలంలో ఉన్న ప్రైవేట్ స్కూళ్లలో డ్రైవర్లకు తక్కువ వేతనాలు ఇస్తూ డ్రైవింగ్ తో పాటు ఇతర పనులుచేయించుకుంటున్నారని అన్నారు. డ్రైవర్ డ్రైవర్ పనులే కాకుండా స్కూల్లో గార్డెన్ పనులు ఇతర పనులను చేయించడం అనేటువంటిది సరైన పద్ధతి కాదని విమర్శించారు. డ్రైవర్లకు కనీస వేత్తనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ఈఎస్ఐ , పిఎఫ్ ప్రతి డ్రైవర్ కి వెంటనే ఇవ్వాలని, కొన్ని స్కూల్స్ లల్లో ఈఎస్ఐ , పిఎఫ్ కు సంబంధించిన అమౌంట్ డ్రైవర్ నుంచే కట్ చేస్తున్నారు తప్ప స్కూల్ నుంచి కలపటం లేదని విమర్శించారు, డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ కమిటీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. మేడ్చల్ మండలం ప్రైవేట్ స్కూల్స్ బస్ డ్రైవర్స్ సీఐటీయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి గా బిట్టు, అధ్యక్షులు గా ఎం . నరేష్, కోశాధికారి గా స్వామి, ఉపాధ్యక్షులుగా రమేష్, రాజు, నరేష్, సహాయ కార్యదర్శి గా భాస్కర్, ఇద్రిష్, శేఖర్, ఆర్గనైజేషన్ కార్యదర్శి గా ఉపేందర్, నవీన్, సలహాదారులు గా గణేష్, కమిటీ సభ్యులుగా దశరత, రాజు, నర్సింహులు, సురేష్, ఆంజనేయులు, నాగభూషణం లతో కలిపి మొత్తం 18 మందితో నూతన మండల కమిటీ నీ ఎన్నుకోవడం జరిగింది అని వివరించారు. నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ డ్రైవర్ల సమస్యల పైన నిరంతరం పోరాటం చేస్తామని, డ్రైవర్లకు ఎప్పుడు అందుబాటులో ఉంటామని తెలియజేయడం జరిగింది.

## గుండ్ల పోచంపల్లి లో ఘనంగా మహంకాళి బోనాలు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )గుండ్లపోచంపల్లి డివిజన్‌లో మహంకాళీ బోనాల ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలో మహంకాళీ బోనాల పండుగ సందర్భంగా ఆ డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి మాజీ కౌన్సిలర్ సాయి పేట శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిపేట శ్రీనివాస్. మాట్లాడుతూ, గుండ్లపోచంపల్లి 299 డివిజన్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొని, ఎలాంటి విద్వేషాలు లేకుండా ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

## డబిల్ పూర్ లో ఘనంగా బోనాలు
### అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించిన గ్రామస్తులు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని దబిల్పూర్ గ్రామంలో బోనాలను అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ముత్యాలమ్మ మహంకాళి అమ్మ నల్ల పోచమ్మ అమ్మ వాళ్లకు బోనాలు సమర్పించారు. ముందుగా ఓడి బియ్యం పోశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నేతలు రాజ మల్లారెడ్డి, భాగ్యరెడ్డి, దామోదర్ రెడ్డి దంపతులు ముత్యాలమ్మ మహంకాళి అమ్మ నల్ల పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగాడబిల్ పూర్ గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలనిసమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల పంటలు బాగా పండాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ ప్రసాద్ కొమ్ము సుధాకర్ చిన్న వినోద్ సాయి స్వరూప్ అనిల్ తదితరులు పాల్గొన్నారు



## త్వరలో పెళ్లి పీటలెక్కనున్న
# పూజా హెగ్డే?
### పెద్దలు కుదిర్చిన సంబంధమంటూ ప్రచారం!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్, బుట్టబొమ్మ పూజా హెగ్డే మరోసారి వార్తల్లో నిలిచారు. అయితే ఈసారి కొత్త సినిమా లేదా గ్లామరస్ ఫోటోషూట్ వల్ల కాదు, తన పెళ్లి వార్తలతో ఆమె సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. త్వరలోనే పూజా హెగ్డే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారంటూ సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఆమె కెరీర్ పరంగా కాస్త నెమ్మదించిన ఈ తరుణంలో ఈ వార్తలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజా సమాచారం ప్రకారం, ఇది ప్రేమ వివాహం కాదని, కుటుంబ సభ్యులు చూసిన సంబంధానికే పూజా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. అయితే ఆమె చేసుకోబోయే వరుడు సినీ పరిశ్రమకు చెందిన వారా లేక వ్యాపారవేత్తా అనే దానిపై ఎలాంటి స్పష్టత లేదు. ఈ వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నప్పటికీ, పూజా హెగ్డే గానీ, ఆమె ప్రతినిధులు గానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. దీంతో ఈ ప్రచారంలో నిజమెంత ఉందనేది తేలాల్సి ఉంది. అభిమానులు మాత్రం అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. ఒకప్పుడు టాలీవుడ్‌ను ఏలిన పూజా హెగ్డే కెరీర్‌ను పరిశీలిస్తే, 2014లో 'ఒక లైలా కోసం' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత 'ముకుంద'లో నటించినా, ఆమెకు అసలైన బ్రేక్ ఇచ్చింది మాత్రం అల్లు అర్జున్‌తో చేసిన 'డీజే: దువ్వాడ జగన్నాథం'. ఈ సినిమా తర్వాత ఆమె వెనుదిరిగి చూసుకోలేదు. ఎన్టీఆర్‌తో 'అరవింద సమేత వీర రాఘవ', మహేష్ బాబుతో 'మహర్షి', అల్లు అర్జున్‌తో 'అలా వైకుంఠపురములో' వంటి బ్లాక్‌బస్టర్ హిట్‌లతో అగ్ర కథానాయికగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. అగ్రస్థానంలో దూసుకెళ్తున్న సమయంలో ఆమెకు వరుస పరాజయాలు ఎదురయ్యాయి. ప్రభాస్‌తో చేసిన పాన్ ఇండియా చిత్రం 'రాధే శ్యామ్' భారీ అంచనాలతో విడుదలై నిరాశపరిచింది. ఆ తర్వాత 'ఆచార్య', తమిళంలో 'బీస్ట్', హిందీలో నటించిన చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోయాయి. దీంతో ఆమె కెరీర్ కొంత నెమ్మదించింది. అయితే, ప్రస్తుతం పూజా హెగ్డే కొత్త ప్రాజెక్ట్‌లతో మళ్లీ బిజీ అవుతున్నారు. మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్‌తో కలిసి 'శ్రీశ్రీ' చిత్రంలో, రాఘవ లారెన్స్ హీరోగా తెరకెక్కుతున్న 'కాంచన 4'లోనూ ఆమె కథానాయికగా ఎంపికయ్యారు.

# ఒకే శరీరంలో
# రెండు ఆత్మలుంటే?



'ఒక మంచి కామెడీ ఎంటర్‌టైనర్‌తో మిమ్మల్ని అలరించాలని ఈ సినిమా చేశాను. ఇందులో నేను రెండు పర్సనాలిటీస్‌తో కనిపిస్తా. ఒకే బాడీలో రెండు ఆత్మలు ఉంటే ఎలాంటి ఛాలెంజెస్ వుంటాయి? అనేది ఇందులో ఆసక్తికరమైన అంశం. దీనికోసం డైరెక్టర్‌తో కలిసి ఎంతో హోమ్‌వర్క్ చేశాను. నటనకు మంచి అవకాశం ఉన్న పాత్ర దొరికింది. నటుడిగా నాకెంతో సంతృప్తినిచ్చిన సినిమా ఇది. ఇందులోని కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా నేచురల్‌గా ఉంటాయి' అని హీరో వరుణ్‌తేజ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు'. రితికా నాయక్ కథానాయిక. మేర్లపాక గాంధీ దర్శకుడు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ కలిసి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో వరుణ్‌తేజ్ మాట్లాడారు. ఆడియన్స్‌కి ఫన్నీ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇదని కథానాయిక రితికా నాయక్ చెప్పారు. ట్రైలర్ అందరికీ నచ్చినందుకు ఆనందంగా ఉందని, సినిమాలో అంతకు మించి ఫన్ ఉంటుందని, వరుణ్, రితికా, సత్య పెర్ఫార్మెన్స్‌ని ప్రేక్షకులు ఓ రేంజ్‌లో ఎంజాయ్ చేస్తారని దర్శకుడు మేర్లపాక గాంధీ తెలిపారు. ఇంకా సత్య, డీవోపీ మనోజ్ కూడా మాట్లాడారు. హారర్, కామెడీ, యాక్షన్, ఎమోషన్స్‌తో పూర్తి వినోదాత్మకంగా ఈ సినిమా ట్రైలర్ సాగింది.

## సెల్ఫీలు ఇవ్వలేను
# క్షమించండి!



సినీతారలు బయట కనిపిస్తే జనాలు ఫొటోల కోసం ఎగబడటం సర్వసాధారణం. ఈ విషయంలో కొందరు హీరోయిన్లు సహకరిస్తే, మరికొందరు పట్టించుకోకుండా వెళ్లిపోతుంటారు. ఇంకొందరైతే జనాలపై కోపాన్ని ప్రదర్శిస్తుంటారు. తాజాగా ప్రియాంక చోప్రాకు కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైంది.

ముంబై ఏయిర్‌పోర్ట్‌లో తన కుమార్తెను ఎత్తుకుని సడెన్ ఎంట్రీ ఇచ్చారు ప్రియాంక చోప్రా. ఒక్కసారిగా ప్రియాంకను చూడగానే సెల్ఫీల కోసం జనం ఎగబడ్డారు. కానీ వారిపై ప్రియాంక కోపగించుకోలేదు. అందుకని సెల్ఫీలు కూడా ఇవ్వలేదు. ఒక్కక్షణం అగి.. 'నేను నా పాపతో ఉన్నాను. ఇప్పుడు సెల్ఫీలు ఇవ్వలేను.. క్షమించండి' అని చిరునవ్వుతో మర్యాదగా జనానికి నచ్చజెప్పి, అక్కడ్నుంచి చరచరా వెళ్లిపోయింది.

ఈ విషయంలో ప్రియాంక ప్రవర్తన అక్కడున్న వారందరికీ బాగా నచ్చింది. అంతర్జాతీయంగా కీర్తి గడించి కూడా ఇంత ఒదిగి ఉండటం సామాన్యమైన విషయం కాదంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## బ్రేకప్ వార్తలపై పరోక్షంగా
# స్పందించిన అనుపమ
### ఇప్పుడు చాలా ప్రశాంతంగా ఉన్నానంటూ కామెంట్



టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్ చిత్రాల్లో తన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా తమిళ నటుడు ధృవ్ విక్రమ్‌తో ప్రేమలో ఉన్నారనే ప్రచారం గత కొంతకాలంగా సాగుతుండగా, ఇప్పుడు వీరిద్దరూ విడిపోయారనే వార్తలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల అనుపమ తన సోషల్ మీడియా ఖాతాలో చేసిన కొన్ని పోస్టులు అభిమానుల దృష్టిని ఆకర్షించాయి. వాటిలో స్వేచ్ఛ, వ్యక్తిగత జీవితం, నిర్ణయాల గురించి చేసిన వ్యాఖ్యలను చూసిన నెటిజన్లు.. అవి ఆమె వ్యక్తిగత జీవితాన్ని ఉద్దేశించినవేనని చర్చించుకుంటున్నారు. ఇకపై నా జీవితంలో ప్రతి నిర్ణయానికి ఎవరి అనుమతి అవసరం లేదు. నేను అనుకున్న చోటికి వెళ్లగలను.. నాకు నచ్చిన విషయాలను పంచుకోగలను. ఇప్పుడు నేను చాలా స్వేచ్ఛగా జీవిస్తున్నాను అనే భావాన్ని వ్యక్తం చేశారు. ఈ పోస్టుల అనంతరం అనుపమ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ధృవ్ విక్రమ్‌ను అన్‌ఫాలో చేసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో, బ్రేకప్ వార్తలకు మరింత ఊతమిచ్చింది. అయితే ధృవ్ విక్రమ్‌తో రిలేషన్‌షిప్ లేదా బ్రేకప్ గురించి అనుపమ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అలాగే ధృవ్ విక్రమ్ కూడా ఈ ప్రచారంపై స్పందించలేదు. అందువల్ల సోషల్ మీడియాలో వస్తున్న ఈ వార్తలను అధికారికంగా ధృవీకరించలేము. తాజాగా అనుపమ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'క్రేజీ కళ్యాణం' సినిమా టీజర్ విడుదల కార్యక్రమంలో ఆమె చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చకు దారితీశాయి. ప్రస్తుతం నేను చాలా సంతోషంగా, ప్రశాంతంగా ఉన్నాను. ఈ ఏడాది నా జీవితంలో చాలా కఠినమైన పరిస్థితులను ఎదుర్కొన్నాను. కానీ ఇప్పుడు మాత్రం మానసికంగా ఎంతో ప్రశాంతంగా ఉన్నాను. ఈ ప్రశాంతత ముందే వచ్చి ఉంటే బాగుండేదనిపిస్తోంది అని అన్నారు. ఆమె వ్యాఖ్యలను కొందరు వ్యక్తిగత జీవితానికి అన్వయించుకుంటుండగా, మరికొందరు అవి కేవలం జీవిత అనుభవాలకు సంబంధించిన సాధారణ వ్యాఖ్యలేనని అభిప్రాయపడుతున్నారు.

వ్యక్తిగత జీవితంపై వస్తున్న వార్తల మధ్య అనుపమ ప్రస్తుతం తన సినిమాలపై దృష్టి పెట్టారు. ఆమె నటిస్తున్న 'క్రేజీ కళ్యాణం' టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. అనుపమ వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న ప్రచారం ఎంత వైరల్

# ఓటీటీలోకి వస్తున్న 'ఇదయం మురళి'..
# స్ట్రీమింగ్ డేట్ ప్రకటించిన నెట్‌ఫ్లిక్స్!




యువ హీరో అథర్వా ప్రధాన పాత్రలో తెరకెక్కిన కమింగ్ ఆఫ్ ఏజ్ రొమాంటిక్ డ్రామా 'ఇదయం మురళి' థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకున్న తర్వాత ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. భావోద్వేగాలతో కూడిన ప్రేమకథగా రూపొందిన ఈ చిత్రానికి థియేటర్లలో మంచి స్పందన లభించగా, ఇప్పుడు డిజిటల్ ప్రీమియర్‌తో మరింత మంది ప్రేక్షకులను చేరుకునేందుకు రెడీ అవుతోంది. తాజాగా ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటించింది. ఆగస్టు 7, 2026 నుంచి 'ఇదయం మురళి' నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. అయితే ఈ సినిమాను ఏయే భాషల్లో అందుబాటులోకి తీసుకురానున్నారనే విషయాన్ని మాత్రం ఇంకా ప్రకటించలేదు. ఈ చిత్రంలో అథర్వాకు జోడీగా ప్రీతి ముఖుందన్, కయాదు లోహర్, జోనితా గాంధీ, మాళవిక మోహనన్ కీలక పాత్రల్లో నటించారు. ప్రతి పాత్ర కథలో ప్రత్యేక ప్రాధాన్యతను కలిగి ఉండగా, వారి నటనకు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు లభించాయి. అలాగే ఈ సినిమాలో మలయాళ స్టార్ నటుడు ఫహాద్ ఫాసిల్ ప్రత్యేక విస్తృత అతిథి పాత్రలో కనిపించడం మరో విశేషం. ఆయన పాత్ర సినిమాకు అదనపు ఆకర్షణగా నిలిచిందని ప్రేక్షకులు అభిప్రాయపడ్డారు. సినిమాకు ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్. థమన్ సంగీతం అందించారు. ముఖ్యంగా పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు మంచి బలం చేకూర్చాయి. భావోద్వేగ సన్నివేశాల్లో థమన్ సంగీతం ప్రేక్షకులను ఆకట్టుకుందని విమర్శకులు ప్రశంసించారు. ఆకాశ్ బాస్కరన్ నిర్మించిన ఈ చిత్రాన్ని డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందించారు. యూత్‌ను ఆకట్టుకునే ప్రేమకథతో పాటు భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇచ్చిన ఈ చిత్రం థియేటర్లలో మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. థియేటర్లలో మంచి స్పందన పొందిన 'ఇదయం మురళి' ఇప్పుడు ఓటీటీ ద్వారా అశేష ప్రేక్షక వర్గాన్ని చేరుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా రొమాంటిక్ డ్రామాలను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సినిమా మంచి ఎంపికగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఆగస్టు 7 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్న 'ఇదయం మురళి' డిజిటల్ విడుదల తర్వాత ఎలాంటి స్పందన అందుకుంటుందో చూడాలి.

## అల్లు శిరీష్ భార్యలో ఈ టాలెంట్ కూడా ఉందా
# నయనికపై ప్రశంసల వర్షం



ఈ ఏడాది వివాహ బంధంలోకి అడుగుపెట్టిన టాలీవుడ్ హీరో అల్లు శిరీష్, తన వ్యక్తిగత జీవితాన్ని ఎంతో ఆనందంగా ఆస్వాదిస్తున్నారు. తాను ప్రేమించిన నయనిక రెడ్డిని వివాహం చేసుకున్న తర్వాత ఈ జంట తరచూ సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటిస్తూ కనిపిస్తోంది. సినిమాల కంటే ప్రస్తుతం కుటుంబ జీవితానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్న శిరీష్, తాజాగా తన భార్యలోని ఓ ప్రత్యేకమైన ప్రతిభను అభిమానులకు పరిచయం చేశారు. పెళ్లి అనంతరం నయనిక రెడ్డి సోషల్ మీడియాలో బాగా చర్చనీయాంశమయ్యారు. ఆమె హావభావాలు, లుక్ గురించి కొందరు ట్రోల్స్ చేసినా, వాటిని అల్లు శిరీష్ ఎంతో హుందాగా స్వీకరిస్తూ సానుకూలంగా స్పందించారు. ఆ సమయంలో ఆయన ఇచ్చిన సమాధానాలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇక తాజాగా శిరీష్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేసిన ఒక ఫోటో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఓ ఆధ్యాత్మిక పూజా కార్యక్రమంలో నయనిక రెడ్డి సంప్రదాయ దుస్తుల్లో ఎంతో భక్తిశ్రద్ధలతో భజనలు, ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తూ కనిపించారు. పసుపు రంగు చీరలో సంప్రదాయబద్ధంగా కనిపించిన నయనిక తన గాత్రంతో అక్కడున్న వారిని ఆకట్టుకున్నట్లు తెలుస్తోంది. ఆమె వెనుక అత్తగారు నిర్మల, తోటికోడలు స్నేహ రెడ్డి, మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖతో పాటు కుటుంబ సభ్యులు భక్తి భావంతో కార్యక్రమంలో పాల్గొనడం ఫోటోలో కనిపించింది. ఈ ఫోటోను పంచుకున్న అల్లు శిరీష్.. "ఆమెలో ఈ కోణం కూడా ఉందా!" అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ క్యాప్షన్ ఇవ్వడం అభిమానులను మరింత ఆకట్టుకుంది. ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు నయనికపై ప్రశంసలు కురిపిస్తున్నారు. "అల్లు కుటుంబ కోడలిలో ఇంత మంచి గాత్రం కూడా ఉందని తెలియదు", "సంప్రదాయాలను గౌరవించడం ఎంతో ఆనందంగా ఉంది", "అల్లు కుటుంబానికి తగ్గ కోడలు" అంటూ పలువురు కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికి పెళ్లి తర్వాత నయనిక రెడ్డి మరో కొత్త కోణాన్ని అభిమానులకు పరిచయం చేయగా, ఆమె ప్రతిభకు అల్లు శిరీష్ ఇచ్చిన ప్రశంసలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. అభిమానులు కూడా ఈ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతూ వారి అన్యోన్యతను ప్రశంసిస్తున్నారు.

# గులాబి గూటికి 40 మంది యువకులు

**- జావిద్ ఖాన్ ఆధ్వర్యంలో చేరికలు**

**- పార్టీ కండువా కప్పి పార్టీలోకిఆహ్వానించిన మాజీ మేయర్ జక్కు వెంకట్ రెడ్డి**



**బోడుప్పల్ (ప్రశ్న న్యూస్)** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి,పీర్జాదిగూడ డివిజన్లకు చెందిన సుమారు 40 మంది యువకులు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు.మాజీ కో-ఆప్షన్ సభ్యులు నాజియా జావిద్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమం పీర్జాదిగూడ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి యువతకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి యువతలోనే ఉందని అన్నారు.బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు.అలాగే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యువతకు ఉపాధి,ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు ప్రాధాన్యత కల్పిస్తూ టీ-హబ్ వంటి అంతర్జాతీయ స్థాయి వేదికలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు.యువత తమ ప్రతిభను ప్రపంచానికి చాటుకునే అవకాశాలను బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిందని తెలిపారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించిన ఆయన... రైతులు,యువత,నిరుద్యోగులు,విద్యార్థులు తీవ్ర నిరాశలో ఉన్నారని అన్నారు.ఈ పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా యువత మళ్లీ బీఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతోందని పేర్కొన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న పోరాటానికి యువత మద్దతు తెలుపుతోందని,అందుకే పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని జక్క వెంకట్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి,యువత భవిష్యత్తు కోసం బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తామని,పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి,సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి,మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్,మధుసూదన్ రెడ్డి,కౌడేపోచయ్య,మహిళా అధ్యక్షురాలు నిర్మల,మైనారిటి అధ్యక్షులు జిలాని పాషా,ఆకుల మధుకర్,శ్యామల శ్రీనివాస్,యాసారం శ్రీనివాస్,మునికుంట్ల కిరణ్ గౌడ్,పింగళి జోగిరెడ్డి,బుల్లెట్ శంకర్,ప్రవీణ్ రెడ్డి,సతీష్,వెంకట్,చిర్ర సంతోష్,సుభాన్,గోపాల్ రెడ్డి,పన్నాభాయ్,అమర్ పటేల్,అజ్వర్ అహ్మద్,సయ్యద్ అబ్రార్,సమీఉద్దీన్,అజ్వర్ ఖాన్,సయ్యద్ అర్బాజ్,సయ్యద్ ఇల్యాస్,మహ్మద్ పర్వేజ్ ఆలం,సాహైర్ హుస్సేన్,రహీమ్ ఖాన్,మహ్మద్ పాషా,సమీర్ ఖాన్,రేహాన్,షేక్సమీర్ హుస్సేన్,రియ్యాన్ హుస్సేన్,షఫీ హుస్సేన్, ఒగ్గ మధు,ఖలీక్ హుస్సేన్,షాకిర్ ఖాన్,సుఫియాన్ హుస్సేన్,తయ్యబ్ అన్సారీ,ఎం.డి. మూసా,జీషాన్, షహ్నావాజ్,సల్మాన్,ఫైజాన్,గణేష్ స్థానిక పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలు...కొందరికి చుట్టాలయ్యాయి

**- అవినీతి,అక్రమాలు చేస్తే కఠినంగా శిక్షించాలి**

**- బోడుప్పల్లో 389వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల**

**- రాజకీయ నాయకులు ప్రజలకు జవాబుదారులుగా ఉండాలి**

**- మేడ్చల్ జిల్లా బిజెపి జనరల్ సెక్రెటరీ గోనె శ్రీనివాస్**




**బోడుప్పల్ (ప్రశ్న న్యూస్)** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 389వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా బిజెపి జనరల్ సెక్రెటరీ గోనె శ్రీనివాస్,అడ్వకేట్ కిరణ్ పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు నివాళు లర్పించి,భారత రాజ్యాంగ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలను,త్యాగాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా గోనె శ్రీనివాస్ మాట్లాడుతూ తన జీవితాన్ని త్యాగం చేసి భారతదేశానికి అత్యుత్తమ రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని,ఆయన ఆశయాలకు అనుగుణంగా భారతీయులందరికీ సమానమైన హక్కులు కల్పించబడ్డాయని,నేడు రాజ్యాంగంలోని చట్టాలు కొందరికి చుట్టాలయ్యాయని,బడుగు,బలహీన వర్గాలకు సరైన న్యాయం జరగడం లేదని,తన,మన తేడా లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతి,అక్రమాలకు పాల్పడిన రాజకీయ నేతలను కఠినంగా శిక్షించాలని,తప్పు చేసిన వారు ఎంతటి వారైనా రాజ్యాంగానికి లోబడే పనిచేయాలని గోనె శ్రీనివాస్ అన్నారు.ఈ కార్యక్రమంలో గరుగుల యాకయ్య, రాపోలు వెంకటేష్,సాయి బండారి,చిల్ల అంజయ్య,రామకృష్ణ,గల్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పులి మృతిపై సీరియస్.. హైపవర్డ్ కమిటీ ఏర్పాటు

**- పవన్ కళ్యాణ్ ఆదేశాలతో ఐదుగురు సభ్యుల కమిటీ**

**- ఎన్ఎస్‌టీఆర్‌లో పులుల సంరక్షణపై సమగ్ర అధ్యయనం**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎన్ఎస్‌టీఆర్)లో ఇటీవల ఆడ పులి అనుమానాస్పద మృతిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ,పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటన నేపథ్యంలో పులుల సంరక్షణ, నిర్వహణ వ్యవస్థపై సమగ్ర అధ్యయనం చేపట్టేందుకు ఐదుగురు సభ్యులతో హైపవర్డ్ కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.దేశంలోనే అతిపెద్ద పులుల ఆవాసాలలో ఒకటైన ఎన్ఎస్‌టీఆర్‌లో పులుల జనాభా, వాటి ఆవాసాలకు ఎదురవుతున్న ముప్పులను గుర్తించి నివారణ చర్యలపై సమగ్ర నివేదిక రూపొందించాలని కమిటీకి బాధ్యతలు అప్పగించారు. పులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణ, ఆవాసాల పరిరక్షణ, క్షేత్రస్థాయి పరిస్థితులపై అధ్యయనం చేసి భవిష్యత్ కార్యాచరణకు మార్గదర్శకాలను రూపొందించాలని సూచించారు.కమిటీలో రాష్ట్ర అటవీశాఖ సలహాదారు పి. మల్లికార్జునరావు, అడిషనల్ పీసీసీఎఫ్ రాహుల్ పాండే శాఖాపరమైన సభ్యులుగా ఉండగా, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ సభ్యుడు బి. రాజశేఖర్, హైదరాబాద్ కన్జర్వేషన్ ఫర్ టైగర్ సొసైటీ ప్రతినిధి ఇమ్రాన్ సిద్ధిఖీ, ప్రముఖ వన్యప్రాణి శాస్త్రవేత్త డాక్టర్ ఎం. నవీన్ కుమార్ సభ్యులుగా నియమితులయ్యారు. కమిటీ సమన్వయ బాధ్యతలను విధుల్లో ఉన్న సీసీఎఫ్ అధికారి నిర్వహించనున్నారు.ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు పునరావృతం కాకుండా సంస్థాగత సంస్కరణలు, సిబ్బంది సామర్థ్యాల పెంపు, మౌలిక సదుపాయాల బలోపేతం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం వంటి అంశాలపై స్పష్టమైన సిఫారసులు చేయాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు, నిపుణులతో సమావేశాలు నిర్వహించి శాస్త్రీయ ఆధారాలతో వీలైనంత త్వరగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని సూచించారు.పులుల సంరక్షణ, అడవుల పరిరక్షణ, జీవవైవిధ్య రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఈ కమిటీ సిఫారసులతో నాగార్జునసాగర్--శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో సంరక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# శ్రీవారి తోమాల సేవ - భక్తి, సుగంధం, పుష్పార్చనల దివ్య వైభవం

**- సుప్రభాతం అనంతరం జరిగే శ్రీవారి అత్యంత ప్రీతిపాత్రమైన పుష్పసేవ**

**(వెంకట్ -- ప్రశ్న న్యూస్ ఏపీ బ్యూరో)**



తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ప్రతిరోజూ తెల్లవారుజామున జరిగే నిత్యకైంకర్యాల్లో సుప్రభాత సేవ అనంతరం నిర్వహించే అత్యంత పవిత్రమైన సేవ తోమాల సేవ. “తోమాల” అనే పదం తమిళంలోని “తోడు మాలై” లేదా “తోడుత్త మాలై” అనే పదం నుంచి వచ్చింది. దీని అర్థం చేతితో అల్లిన పుష్పమాలను స్వామివారికి సమర్పించడం. ఇది కేవలం పూలను అలంకరించడం మాత్రమే కాదు, భక్తి, సుగంధం, సౌందర్యం, ఆత్మసమర్పణ కలగలిపిన దివ్యారాధన.శ్రీవారికి పుష్పాలు అత్యంత ప్రీతికరమైనవి. అందుకే తోమాల సేవను ఆలయంలో అత్యంత విశిష్టమైన నిత్యారాధనగా భావిస్తారు. వైఖానస ఆగమ సంప్రదాయం ప్రకారం భగవంతునికి స్నానం, వస్త్రాభరణాలు, ఆభరణాల అలంకరణ అనంతరం పుష్పాలతో అలంకరించడం అత్యంత ముఖ్యమైన ఉపచారంగా పేర్కొనబడింది.

### తోమాల సేవ ఎలా జరుగుతుంది.?

సుప్రభాత సేవ ముగిసిన తర్వాత ఆలయ అర్చకులు శ్రీవారికి శాస్త్రోక్తంగా నిత్యారాధనలు నిర్వహిస్తారు. అనంతరం పవిత్రమైన, సుగంధభరితమైన పూలతో ప్రత్యేకంగా అల్లిన మాలలను స్వామివారికి సమర్పిస్తారు.మల్లె, సంపంగి, గులాబీ, తులసి, కనకాంబరం, చామంతి, దవనం వంటి సుగంధభరిత పుష్పాలను అత్యంత శ్రద్ధతో ఎంపిక చేస్తారు. ప్రతి మాలను నిర్దిష్ట కొలతలు, ఆగమ నియమాలకు అనుగుణంగా తయారు చేస్తారు. అర్చకులు వేదమంత్రాలు, దివ్యప్రబంధ పాశురాలు, శ్రీ వేంకటేశ్వరుని స్తోత్రాలను పారాయణం చేస్తూ స్వామివారికి పుష్పాలంకరణ చేస్తారు.శిరస్సు నుంచి పాదాల వరకు వివిధ భాగాలకు ప్రత్యేక పుష్పమాలలు అలంకరిస్తారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకూ ప్రత్యేక పుష్పాలంకరణ జరుగుతుంది. ఈ సమయంలో గర్భగుడిలో ఆధ్యాత్మిక వాతావరణం పరిమళాలతో నిండిపోతుంది.

### ఈ సేవ ఎప్పుడు ప్రారంభమైంది.?

తోమాల సేవకు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. తిరుమలలో వైఖానస ఆగమ విధానంలో నిత్యారాధనలు ప్రారంభమైన కాలం నుంచే ఈ సేవ కొనసాగుతున్నట్లు ఆగమ గ్రంథాలు, ఆలయ సంప్రదాయాలు తెలియజేస్తున్నాయి.పల్లవులు, చోళులు, విజయనగర రాజుల కాలంలో ఈ సేవకు మరింత వైభవం వచ్చింది. ముఖ్యంగా శ్రీకృష్ణదేవరాయలు తిరుమల ఆలయానికి సమర్పించిన పుష్పవనాలు, పూల తోటలు తోమాల సేవ అభివృద్ధికి ఎంతో దోహదపడ్డాయి. తిరుమలలో నేటికీ పుష్పాల కోసం ప్రత్యేక ఉద్యానవనాలు నిర్వహించబడుతున్నాయి.తోమాల సేవ ఏ రోజుల్లో నిర్వహిస్తారు?తోమాల సేవ ప్రతిరోజూ నిర్వహించే నిత్యకైంకర్యం. వారంలో ఏ రోజు అయినా ఈ సేవ జరుగుతుంది. అయితే ఆలయ ఉత్సవాలు, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి, ప్రత్యేక పర్వదినాల్లో ఆ రోజు కార్యక్రమాలకు అనుగుణంగా సమయాల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు. కానీ పుష్పాలంకరణ అనే నిత్యకైంకర్యం మాత్రం ఆగదు.

### సేవాకైంకర్యం విశిష్టత

తోమాల సేవలో పాల్గొనే అవకాశం భక్తులకు పరిమితంగా ఉంటుంది. ఈ సేవను టిటిడి నిర్ణయించిన విధానాల ప్రకారం టికెట్ లేదా ఇతర కేటాయింపుల ద్వారా నిర్వహిస్తారు. సేవలో పాల్గొనే భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో ఆలయంలో ప్రవేశించి, అత్యంత సమీపం నుంచి స్వామివారి దివ్య మంగళ విగ్రహాన్ని పుష్పాలంకరణలో దర్శించే భాగ్యం పొందుతారు.

### పుష్పాల ప్రాముఖ్యత

హిందూ ధర్మంలో పుష్పం పవిత్రతకు ప్రతీక. భగవంతునికి పుష్పాలను సమర్పించడం అంటే మన హృదయాన్ని సమర్పించినట్లే భావిస్తారు. ప్రతి పువ్వు ఒక మంచి గుణానికి ప్రతీకగా చెప్పబడింది. తులసి -- భక్తి మల్లె -- పవిత్రత సంపంగి -- మంగళం గులాబీ -- ప్రేమ చామంతి -- శాంతి దవనం -- శుభసూచకం ఈ పుష్పాలన్నీ కలిసి స్వామివారి దివ్యమూర్తిని మరింత సుందరంగా అలంకరిస్తాయి.

### ఆళ్వారుల భక్తి -- పుష్పసేవ గొప్పతనం

వైష్ణవ సంప్రదాయంలో ఆళ్వారులు భగవంతునికి పూలమాలలు సమర్పించడాన్ని అత్యున్నత భక్తిగా కీర్తించారు. ముఖ్యంగా ఆండాళ్ అమ్మవారు స్వయంగా ధరించిన పూలమాలను శ్రీమన్నారాయణునికి సమర్పించిన కథ వైష్ణవ సంప్రదాయంలో అత్యంత ప్రసిద్ధి చెందింది. అందువల్ల పుష్పసేవకు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక స్థానం లభించింది.

### శ్రీవారికి తోమాల సేవ ఎందుకు అత్యంత ఇష్టం.?

శాస్త్రాల ప్రకారం భగవంతుడు భక్తుని హృదయాన్ని, ప్రేమను స్వీకరిస్తాడు. పుష్పం సౌందర్యం, సుగంధం, మృదుత్వం,



స్వచ్ఛతకు ప్రతీక. అలాంటి పుష్పాలను భక్తితో సమర్పించడం ద్వారా భగవంతుని అనుగ్రహం లభిస్తుందని ఆగమాలు చెబుతున్నాయి.పుష్పం తన పరిమళాన్ని అందరికీ పంచినట్లే, భక్తుడు కూడా తన జీవితాన్ని ఇతరులకు ఉపయోగపడేలా అంకితం చేయాలనే సందేశాన్ని తోమాల సేవ అందిస్తుంది. అందుకే శ్రీవేంకటేశ్వరస్వామివారికి పుష్పార్చన అత్యంత ప్రీతికరమైన సేవగా భావిస్తారు.

### భక్తులకు ఆధ్యాత్మిక సందేశం

తోమాల సేవ కేవలం ఒక ఆలయ ఆచారం మాత్రమే కాదు. ప్రతి భక్తుడు తన మనసును ఒక పుష్పంలా నిర్మలంగా మార్చుకుని భగవంతునికి సమర్పించుకోవాలనే సందేశాన్ని ఈ సేవ అందిస్తుంది. పూలు కొద్ది గంటల్లో వాడిపోతాయి. అలాగే మన జీవితమూ శాశ్వతం కాదని గుర్తుచేస్తూ, ఉన్న కాలంలో ధర్మం, సేవ, భక్తి మార్గంలో నడవాలని ఈ కైంకర్యం బోధిస్తుంది.ప్రతి ఉదయం సుప్రభాతంతో మేల్కొన్న శ్రీవారికి తోమాల సేవ జరగడం, అనంతరం అర్చన, నైవేద్యం వంటి నిత్యకైంకర్యాలు కొనసాగడం తిరుమల ఆలయ ఆధ్యాత్మిక వైభవానికి నిదర్శనం.

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి తోమాల సేవ అనేది వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న వైఖానస ఆగమ సంప్రదాయంలోని అత్యంత పవిత్రమైన నిత్యకైంకర్యం. భక్తి, సౌందర్యం, పరిమళం, శాస్త్రోక్త విధానం -- ఈ నాలుగు అంశాల సమ్మేళనమే తోమాల సేవ. ప్రతిరోజూ తెల్లవారుజామున సుప్రభాతం అనంతరం జరిగే ఈ సేవలో స్వామివారు సుగంధ పుష్పాలతో అలంకరించబడిన దివ్య మంగళ స్వరూపంగా భక్తులకు దర్శనమిస్తారు. శ్రీవారికి పుష్పార్చన అత్యంత ప్రీతిపాత్రమైనదని వైష్ణవ ఆగమాలు, ఆళ్వారుల దివ్యప్రబంధాలు, తిరుమల ఆలయ శతాబ్దాల సంప్రదాయం స్పష్టంగా తెలియజేస్తున్నాయి. అందుకే తోమాల సేవను దర్శించడం, అందులో పాల్గొనడం ప్రతి వైష్ణవ భక్తుడు తన జీవితంలో ఒక గొప్ప ఆధ్యాత్మిక భాగ్యంగా భావిస్తాడు.

# భక్తులే ప్రాధాన్యం క్షేత్రస్థాయిలో ఈఓ తనిఖీలు

**- ఘాట్‌రోడ్డు నుంచి స్నానఘట్టాల వరకు విస్తృత పరిశీలన**

**- అసౌకర్యం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశాలు**



**విజయవాడ (ప్రశ్న న్యూస్)** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు అప్రమత్తంగా పనిచేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ), స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ సీనా నాయక్ అధికారులను ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో శనివారం విస్తృతంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించిన ఆయన, ఘాట్ రోడ్డు, కృష్ణా నది స్నానఘట్టాలు, కేశఖండనశాల, టికెట్ కౌంటర్లు, మొబైల్ డిపాజిట్ కేంద్రాలు, లగేజీ కౌంటర్లు, చెప్పుల స్టాండ్లు, స్కానింగ్ పాయింట్లను స్వయంగా పరిశీలించారు.చేతిలో వైర్‌లెస్ సెట్‌తో ఘాట్ రోడ్డు వెంబడి నడుస్తూ భక్తుల రద్దీని ప్రత్యక్షంగా పరిశీలించిన ఈఓ, ఎక్కడా రద్దీ పేరుకుపోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోర్ సిబ్బందికి సూచించారు. భక్తుల రాకపోకలు సజావుగా కొనసాగేలా సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు.కృష్ణా నది స్నానఘట్టాల వద్దకు చేరుకున్న ఈఓ, పవిత్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. నదీ తీరంలో భద్రతా చర్యలు, పరిశుభ్రత, రక్షణ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తుల రద్దీ పెరిగే సమయాల్లో అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.అనంతరం కేశఖండనశాల (కళ్యాణకట్ట)ను సందర్శించిన ఆయన, తలనీలాలు సమర్పించే హాల్, స్నానపు గదులు, మరుగుదొడ్ల పరిశుభ్రతను నిశితంగా పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. తలనీలాలు సమర్పించుకున్న భక్తులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భక్తులు సూచించిన అంశాలను నమోదు చేసి, అవసరమైన చోట వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఘాట్ రోడ్డులోని టికెట్ కౌంటర్లు, మొబైల్ ఫోన్ డిపాజిట్ కేంద్రాలు, చెప్పుల స్టాండ్లు, లగేజీ కౌంటర్లు, స్కానింగ్ పాయింట్ల పనితీరును కూడా ఈఓ పరిశీలించారు. భక్తులు ఎక్కువసేపు వేచి ఉండకుండా వేగంగా సేవలు అందించాలని, క్యూ లైన్లలో ఎలాంటి అంతరాయం లేకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఆలయానికి విచ్చేసే ప్రతి భక్తుడికి సురక్షితమైన, పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన దర్శన వాతావరణం కల్పించడం ఆలయ యంత్రాంగం బాధ్యత అని ఈ సందర్భంగా ఈఓ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ఎక్కడైనా చిన్న సమస్య కనిపించినా వెంటనే పరిష్కరించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి, దర్శన ఏర్పాట్లు, పరిశుభ్రత, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, క్యూ లైన్ల నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని ఈఓ సీనా నాయక్ స్పష్టం చేశారు.

# ఘనంగా ఆషాఢ మాసం బోనాలు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్ల పోచంపల్లి పరిధిలో ఆషాడ మాసం బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఆషాడ మాసం బోనాల సందర్భంగా కండ్లకోయ పట్టణంలో గల పెద్దమ్మ గుడికి పట్టణ ప్రాంత ప్రజలందరూ కులాలకు అతీతంగా బోనాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించి, డివిజన్ లోని వివిధ పార్టీ ల పెద్దలు కూడా పూజల లో పాల్గొని పట్టణ ప్రాంత ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురిచి రైతుల పంటలు బాగా పండాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు కందాడి నరేందర్ రెడ్డి, కర్రోళ స్వామి,ఎస్ రవీందర్ గౌడ్ , మాజీ కౌన్సిలర్ ఎస్ క్రిష్ణ గౌడ్, గుండ్ల పోచంపల్లి మాజీ సర్పంచ్ బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా మద్దుల శ్రీనివాస్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబెర్ లు ఎస్ రాజేందర్ ముదిరాజ్, టీ వెంకటేష్ ముదిరాజ్ టి శ్రీనివాస్ ముదిరాజ్, వై ప్రభాకర్, పి వీరాస్వామి ముదిరాజ్ సంఘం అధ్యక్షులు టీ పెంటేష్ ముదిరాజ్ టీ బిక్షపతి ముదిరాజ్,ఎస్ నరేందర్ ముదిరాజ్‌కే సత్యనారాయణ ముదిరాజ్ మచ్చ కార సంఘం అధ్యక్షులు కే శ్రీకాంత్ ముదిరాజ్ ఉపాధ్యక్షులు జై శివ ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి అల్లి సుధాకర్ ముదిరాజ్ మస్త్యకార సంఘం డైరెక్టర్ లు ఎస్ కిషోర్ ముదిరాజ్ టి బాబు ముదిరాజ్ సభ్యులు ఏ శ్రీనివాస్ గౌడ్ కర్రోళ హరికృష కర్రోళ సంతోష్, వీరేష్ బి శ్రీనివాస్ ఎర్రోళ్ల శ్రీశైలం సాయిలు తదితరులు పట్టణ ప్రాంత ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# రూ.87 కోట్ల ప్రభుత్వ ధాన్యం మాయం



- సీఎంఆర్ బియ్యం పక్కదారి.. మూడు రైస్ మిల్లులపై విజిలెన్స్ కొరడా
- అక్రమాలకు పాల్పడిన రైస్ మిల్లర్ కొండ లక్ష్మణ్, ఇతరులపై క్రిమినల్ కేసులు
- కలెక్టర్ ఆదేశాలతో జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసుల నమోదు



**జగిత్యాల (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ ధాన్యాన్ని కాపాడాల్సిన వ్యవస్థలోనే భారీ అక్రమాలు వెలుగులోకి రావడం జగిత్యాల జిల్లాలో కలకలం రేపుతోంది. ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ ధాన్యాన్ని నిబంధనలకు విరుద్ధంగా పక్కదారి మళ్లించినట్లు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గుర్తించారు. ప్రాథమిక విచారణ, తనిఖీల అనంతరం సుమారు రూ. 87 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టినట్లు అధికారులు నిర్ధారించడం తీవ్ర సంచలనంగా మారింది. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బసవరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా సివిల్ సప్లై అధికారి ఎస్. జితేందర్ రెడ్డి, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సంయుక్తంగా జగిత్యాల జిల్లాలోని శ్రీ అభయాంజనేయ సాయి రైస్ మిల్, శ్రీ లక్ష్మీ బాలాజీ ఇండస్ట్రీస్, లక్ష్మీ గణపతి ఇండస్ట్రీస్లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా ప్రభుత్వానికి సీఎంఆర్ కింద అప్పగించాల్సిన ధాన్యాన్ని నిబంధనలకు విరుద్ధంగా పక్కదారి మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. రికార్డులు, నిల్వలు, ధాన్యం లెక్కలపై పరిశీలన జరిపిన అనంతరం భారీ మొత్తంలో ప్రభుత్వ ధాన్యం అక్రమంగా మళ్లించినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

### మిల్లర్ల అక్రమాలపై క్రిమినల్ చర్యలు..

ప్రభుత్వ ధాన్యం విషయంలో అక్రమాలకు పాల్పడిన రైస్ మిల్లుల యాజమాన్యాలపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని



జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో మిల్లు యజమాని కొండ లక్ష్మణ్ తదితరులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

### ధాన్యం దందాపై ఉక్కుపాదం..

ప్రజల కోసం ప్రభుత్వం సమకూర్చిన ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తే



సహించేది లేదని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ ధాన్యం గల్లంతు కావడం వెనుక ఇంకా ఎవరెవరి పాత్ర ఉందనే కోణంలోనూ సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కోట్ల విలువైన సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టిన వ్యవహారంలో కేవలం మిల్లర్లపైనే కాకుండా, ధాన్యం సేకరణ నుంచి నిల్వలు, సీఎంఆర్ అప్పగింత వరకు జరిగిన ప్రక్రియను పూర్తిస్థాయిలో పరిశీలిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

# ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు

- కబ్జాదారులకు ఆర్ఐ వత్తాసు.? - బోడుప్పల్ ఆర్ఐ రూటే సపరేట్
- 63/1 లో ప్రభుత్వ భూముల్లో కబ్జా చేస్తున్నా కబ్జాదారులకే వత్తాసు.?
- ఫిర్యాదు చేసిన వారి వివరాలు అక్రమార్కులకు ఎలా చేరుతున్నాయో.?
- ఉన్నతాధికారులకు తప్పుడు సంకేతాలిస్తున్న ఆర్ఐపై ఆరోపణలు
- ఎస్ఐఆర్ సాకుతో ఫోన్‌కు అందుబాటులో లేరన్న విమర్శలు
- ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారనే అభ్యంతరాలు





**బోడుప్పల్(ప్రశ్న న్యూస్)** మల్కాజ్‌గిరి కార్పొరేషన్ బోడుప్పల్ పరిధిలో సర్వేనెంబర్ 63/1 ప్రభుత్వ భూముల ఆక్రమణల వ్యవహారం జోరుగా సాగుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములపై కబ్జాలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగమే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బోడుప్పల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) వ్యవహార శైలిపై పలువురు ఫిర్యాదుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు చేసిన వ్యక్తుల వివరాలు సంబంధిత కబ్జాదారులకే చేరుతున్నాయని, దీంతో ఫిర్యాదుదారులు ఒత్తిళ్లు, బెదిరింపులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందని ఆరోపిస్తున్నారు. ఇటువంటి చర్యలు ఫిర్యాదు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని స్థానికులు అంటున్నారు. అలాగే, భూముల ఆక్రమణలపై ఉన్నతాధికారులకు వాస్తవ పరిస్థితులకు భిన్నంగా నివేదికలు పంపుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ భూముల రక్షణ చర్యలు మందగిస్తున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) పనులను సాకుగా చూపుతూ ప్రజల ఫోన్ కాల్స్‌కు స్పందించడం లేదని, అత్యవసర ఫిర్యాదులకూ అందుబాటులో ఉండడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అందుబాటులో ఉండాల్సిన సమయంలో ఈ వైఖరి సరికాదని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు సంబంధించి ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలు అమలు



కావడం లేదని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపించడం వల్ల ఆక్రమణదారులు మరింత ధైర్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బోడుప్పల్ ప్రాంతంలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలపై హైడ్రా అధికారులచే సమగ్ర విచారణ జరిపి, ఫిర్యాదుల నిజానిజాలను వెలికితీయాలని, విధుల్లో నిర్లక్ష్యం లేదా అక్రమాలకు సహకారం అందిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. స్థానికంగా ప్రభుత్వ భూములను రక్షించడంలో బోడుప్పల్ రెవిన్యూ అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారని అందుకోసమే ఈ ప్రాంతంలో కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు ఇప్పటికే పూర్తిస్థాయిలో కబ్జాకు గురయ్యాయని వాటిని వెంటనే హైడ్రా పరిశీలించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## స్టాక్ మార్కెట్ కొత్త ట్రేడింగ్ సమయాలు

- వారం రోజుల్లో లక్షల కోట్లు ఆర్జించిన దిగ్గజాలు



భారత స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ వ్యవస్థలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇన్వెస్టర్లకు మెరుగైన అవకాశాలు కల్పించడం, మార్కెట్ సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన ఈ కొత్త నిబంధనలు సోమవారం, ఆగస్టు 3 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మార్పుల్లో భాగంగా ఈక్విటీ డెరివేటివ్స్ (ఎఫ్&ఓ) ట్రేడింగ్ సమయాన్ని పొడిగించడంతో పాటు, ఎఫ్‌డఓ విభాగంలో ఉన్న స్టాక్స్‌కు ప్రత్యేకంగా 'క్లోజింగ్ ఆక్షన్ సెషన్'ను ప్రవేశపెట్టారు.

### కొత్త క్లోజింగ్ విధానం వివరాలు

తాజా నిబంధనల ప్రకారం, ఎఫ్‌డఓ విభాగంలోని స్టాక్స్ (క్యాష్ సెగ్మెంట్)కు రెగ్యులర్ ట్రేడింగ్ మధ్యాహ్నం 3:15 గంటలకు ముగుస్తుంది. ఆ తర్వాత ప్రత్యేకంగా క్లోజింగ్ ఆక్షన్ సెషన్ మొదలవుతుంది. 3:15 -- 3:20 PM: ట్రాన్సిషన్ పీరియడ్ (మార్పు దశ). 3:20 -- 3:25 PM: సీఏఎస్ ఆర్డర్ ఎంట్రీ 1 (ఈ సమయంలో ఆర్డర్లు వేయవచ్చు లేదా మార్చుకోవచ్చు). 3:25 -- 3:30 PM: సీఏఎస్ ఆర్డర్ ఎంట్రీ 2 (ఈ దశలో మార్కెట్ ఆర్డర్లను మార్చడానికి లేదా రద్దు చేయడానికి వీలుండదు. చివరి రెండు నిమిషాల్లో యాదృచ్ఛికంగా వేలం ముగుస్తుంది). 3:30 -- 3:35 PM: ఆర్డర్ మ్యాచింగ్. ఈ సెషన్‌లో కనుగొన్న ధరనే ఆ రోజుటి అధికారిక ముగింపు ధరగా పరిగణిస్తారు. అయితే, నాన్-ఎఫ్‌డఓ ఈక్విటీ క్యాష్ స్టాక్స్ ట్రేడింగ్ విషయంలో ఎలాంటి మార్పులు లేవని, యథావిధిగా మధ్యాహ్నం 3:30 గంటలకు ముగుస్తుందని సెబీ స్పష్టం చేసింది. మరో కీలక మార్పుగా, ఎఫ్‌డఓ (ఈక్విటీ డెరివేటివ్స్) సెగ్మెంట్‌లో ట్రేడింగ్ సమయాన్ని 10 నిమిషాలు పొడిగించారు. దీంతో ట్రేడింగ్ సాయంత్రం 3:40 గంటల వరకు కొనసాగుతుంది. అలాగే, ప్రీ-ఓపెన్ సెషన్‌లో కూడా స్వల్ప మార్పులు చేశారు. ఉదయం 9:00 నుంచి 9:07 గంటల వరకు మాత్రమే ఆర్డర్ ఎంట్రీ విండో అందుబాటులో ఉంటుంది. 9:07 నుంచి 9:15 మధ్య ఆర్డర్లు మ్యాచ్ అవుతాయి. యథావిధిగా 9:15 గంటలకు రెగ్యులర్ ట్రేడింగ్ ప్రారంభమవుతుంది.

## ఏపీలో తక్కువ ధరకే బియ్యం

- అమ్మకాలు ప్రారంభించిన మంత్రి నాదెండ్ల



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పిస్తూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించేందుకు, తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 130 రైతు బజార్లు, 500 రైస్ మిల్లుల వద్ద ప్రత్యేక కౌంటర్ల ద్వారా సబ్సిడీ బియ్యం విక్రయాలను ఆదివారం ప్రారంభించింది. విజయవాడలోని ఏపీఐఐసీ రైతు బజార్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి, ప్రజలకు స్వయంగా బియ్యాన్ని అందజేశారు. ఈ పథకం కింద బీపీటీ సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ. 52కు, బీపీటీ రా రైస్‌ను కిలో రూ. 50కే విక్రయిస్తున్నారు. ఆధార్ కార్డు చూపించి ఒక వ్యక్తి 10 కిలోల వరకు బియ్యం కొనుగోలు చేయవచ్చు. బహిరంగ మార్కెట్‌లో రూ. 60 నుంచి రూ. 65 వరకు పలుకుతున్న ఈ రకం బియ్యాన్ని ప్రభుత్వం తక్కువ ధరకే అందుబాటులోకి తేవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "ప్రజలకు కష్టం రాకముందే వారిని ఆదుకునే ప్రభుత్వం మాది. మార్కెట్‌లో బియ్యం ధరలను సమీక్షించి, సామాన్యుడిపై భారం పడకుండా తక్కువ ధరకే బియ్యం అందించాలని నిర్ణయించాం. మా విజ్ఞప్తికి రైస్ మిల్లర్లు సానుకూలంగా స్పందించి సహకరించడం అభినందనీయం" అని తెలిపారు. భవిష్యత్తులో కందిపప్పు, పామాయిల్‌ను కూడా తక్కువ ధరలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన రావు, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ నూపుర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జనసేన నేత అమ్మిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.ఐ

## గోదావరి ఉగ్రరూపం

- ఇంకా ముంపులోనే లంక గ్రామాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. వరద పోటెత్తడంతో కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలు వణికిపోతున్నాయి. స్థానికంగా వర్షాలు తగ్గుముఖం పట్టినా, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటకల నుంచి భారీగా వస్తున్న వరద నీటితో గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో లంక గ్రామాలు నీట మునిగి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోనసీమ జిల్లాలోని అనేక లంక గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలోని లంక గ్రామాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గోగులంక, గుత్తెనదీవి, కేసనకుర్రు వంటి ప్రాంతాల్లో బోట్ల సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. తానేలంక - గురజాపులంక మధ్య రహదారిపై వరద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. అప్పనపల్లి, ముక్తేశ్వరం, కనకాయలంక, అయ్యినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక వంటి అనేక గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కొబ్బరి రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ట్రాక్టర్ల సహాయంతో కాయలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాజమండ్రి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నదీ తీరం కోతకు గురవుతోంది. అధికారులు ఇసుక బస్తాలు వేసి కోతను అరికట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం చింతపల్లి వద్ద, గౌతమి పాయ ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. అయితే, గత రాత్రితో పోలిస్తే ప్రవాహం స్వల్పంగా తగ్గింది. భారీగా వస్తున్న వరద నీరు సముద్రంలోకి వెళుతోంది. మరోవైపు, ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే బాలరాజు, ఎస్పీ ప్రశాంత్ కిశోర్ పరిశీలించారు. అధికారులు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి, లంక గ్రామాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. కలెక్టర్ మహేశ్ కుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, అధికారులకు తగిన సూచనలు జారీ చేస్తున్నారు. సహాయక చర్యలు ముమ్మరం చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588